# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 235 | హైదరాబాద్ | బుధవారం 11-03-2026 | పేజీలు : 12 | వెల : 1.00





11లో

ఇరాన్ నౌకలను ముంచడం మా సైన్యానికి సరదాగా అనిపించింది: డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు

## వంటగ్యాస్ ఆందోళన...
# ప్రధాని మోదీ కీలక సమీక్ష



11లో

- 10 శాతం మేర ఉత్పత్తి పెంచాలని ఇంధన ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు
- భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయన్న కేంద్రం
- దేశానికి 70 శాతం ఉత్పత్తులు ఇతర మార్గాల్లో వస్తున్నాయన్న కేంద్రం

## తెలంగాణలో 'ఆపరేషన్ క్రాక్‌డౌన్'... 208 మంది అరెస్ట్!

11లో

## చర్లపల్లి-కామాఖ్య అమృత్ భారత్ రైలు..
# ఈ నెల 13న ప్రారంభం

11లో

- చర్లపల్లి - కామాఖ్య మధ్య కొత్త అమృత్ భారత్ రైలు
- మార్చి 13న కామాఖ్యలో ప్రారంభించనున్న రైల్వే శాఖ
- తెలుగు రాష్ట్రాల్లో పలు ముఖ్య స్టేషన్లలో ఆగుతుందని ప్రకటన
- తక్కువ ఖర్చుతో సురక్షితమైన ప్రయాణం కల్పించడమే లక్ష్యం
- ఇటీవలే నాగర్‌కోయిల్ - చర్లపల్లి మధ్య మరో రైలును ప్రకటించిన రైల్వే





## యుద్ధం ఎప్పుడు ఆపాలన్నది
# ఆపాలన్నది మా చేతుల్లోనే ఉంది

- యుద్ధం త్వరగానే ముగుస్తుందన్న ట్రంప్ వ్యాఖ్యలకు కౌంటర్
- ప్రారంభించడం వరకే ట్రంప్ చేతుల్లో.. ముగింపును తామే డిసైడ్ చేస్తామని వెల్లడి
- శాంతి కోసం పుతిన్ ప్రయత్నాలు.. ట్రంప్‌కు ఫోన్ కాల్

11లో

## దుబాయ్ లో యుద్ధ భయం..
## ఎడారిలో మూగజీవాల ఆక్రందన

- క్షిపణి దాడుల భయంతో దుబాయ్ వీడుతున్న ప్రవాసులు
- పెంపుడు జంతువులను తీసుకెళ్లలేక స్తంభాలకు కట్టేసి పోతున్న వైనం
- ఒమన్ సరిహద్దుల్లో పెంపుడు జంతువులకు నో ఎంట్రీ


11లో




## పసిడికి మళ్లీ రెక్కలు..
# భారీగా పెరిగిన బంగారం, వెండి

- ఇవాళ భారీగా లాభపడిన బంగారం, వెండి ధరలు
- మధ్యప్రాచ్యంలో శాంతి సంకేతాలతో పతనమైన చమురు ధరలు
- బలహీనపడిన అమెరికా డాలర్‌తో పసిడికి మద్దతు
- ఎంసీఎక్స్‌లో తులం బంగారం రూ.1,62,000 పైకి చేరిక
- కిలో వెండి రూ.2,77,000కు ఎగబాకిన వైనం

11లో



## అది ఫేక్ ప్రచారం..
## వాటిని నమ్మొద్దు
: మంత్రి నారా లోకేశ్



- దేవాలయాల విధ్వంసంపై వైసీపీ ఫేక్ ప్రచారం చేస్తోందన్న మంత్రి లోకేశ్
- కసాపురం ఆలయ పునర్నిర్మాణ వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్
- ఆగమ సలహాదారుల ప్రకారమే పాత ఆలయాన్ని తొలగించామని వెల్లడి
- వైసీపీ పేటియం బ్యాచ్ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరిక

11లో

## 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్
# మెటీరియల్ హబ్'గా ఏపీ

- ఏపీ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ ఏర్పాటుకు సన్నాహాలు
- రాబోయే పదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, 40 వేల ఉద్యోగాలే టార్గెట్
- శ్రీకాకుళం, అనకాపల్లి, మచిలీపట్నంలో 3 ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదన
- రాష్ట్రంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్‌పై ప్రత్యేక దృష్టి

11లో





## దేశంలో చిల్లర నోట్లకు
# కొరత లేదు: కేంద్రం

- దేశంలో రూ.10, 20, 50 నోట్లకు ఎలాంటి కొరత లేదని వెల్లడి
- ఈ విషయంపై పార్లమెంటులో స్పష్టత ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం
- చిన్న నోట్ల పంపిణీకి ప్రత్యేక పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం

11లో

భారత శక్తి

# పదేళ్లలో 61 యుద్ధాలు... ముగింపు ఎప్పుడు

భారత ప్రధాని నరేంద్రమోదీ నాలుగేళ్ల క్రితం రష్యా?ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభం కాగానే ఒక ప్రకటన చేశారు. రష్యా, ఉక్రెయిన్ దేశాల ప్రతినిధులతో మాట్లాడి ఇది యుద్ధాల యుగం కాదని తెలిపారు. మోదీ ఈ మాట అన్నప్పటికీ ఆయన అంచనా తప్పింది. 2016 నుంచి 2026 మార్చి వరకు చూసినట్లయితే ప్రపంచ వ్యాప్తంగా అనేక యుద్ధాలు జరిగాయి. అంతర్జాతీయంగా యుద్ధాలను అధ్యయనం చేసే సంస్థ 78 దేశాలు పదేళ్లలో యుద్ధాలు చేశాయి. ఈ 78 దేశాలు 61 యుద్ధాల్లో పాల్గొన్నాయి. ఇందులో ప్రభుత్వాలు ఉన్నాయి. ఉగ్రవాద సంస్థలు ఉన్నాయి. స్వతంత్రం కోసం పోరాడే సంస్థల ఉన్నాయి.2016?2026లో 61 యుద్ధాలు జరిగాయి. ఇందులో ప్రభుత్వాలు, ఉగ్రవాద గుండాలు, విముక్తి సంస్థలు పాల్గొన్నాయి. యూరప్‌లో రష్యా?ఉక్రెయిన్ యుద్ధం మ్యాపులు మార్చింది. యూరప్‌లో ఉద్రిక్తత కొనసాగుతోంది. మాజీ రష్యా ప్రాంతం అజర్‌బైజాన్, ఉక్రెయిన్‌లో, గల్ఫ్‌లో 1948 నుంచి అనేక దేశాలు యుద్ధాల్లో ఉన్నాయి. ఆఫ్రికాలో, ఆసియాలో యుద్ధాలు జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా అనేక చోట్ల యుద్ధాలు, అంతర్గత తిరుగుబాట్లు జరిగాయి. ఉక్రెయిన్ యుద్ధం 2022, ఫిబ్రవరిలో మొదలైంది. 1948లో ముగిసిన రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జరిగిన అతిపెద్ద యుద్ధం ఇదే. మ్యాపును మార్చే యుద్ధంగా చెప్పవచ్చు. 1990?91లో సోవియన్ యూనియన్ పతనం అయిన తర్వాత యూరప్ జాగ్రఫీ మారింది. ఇప్పుడు రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో ఆర్థిక నష్టం, జన నష్టం, సంపద నష్టం విపరీతంగా జరిగింది. ఏళ్ల తరబడి యుద్ధం కొనసాగడవే ఇందుకు కారణం.ఇజ్రాయెల్ 2023 అక్టోబర్‌లో హమాస్‌కు చెందిన ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడిచేసి అనేక మందిని ఊచకోత కోశారు. దీంతో ఇజ్రాయెల్ గాజాపై దాడిచేసింది. ఇది రెండేళు కొనసాగింది. ఆ తర్వాత లెబనాన్, హెజ్‌బొల్లాపై దాడి చేసింది. ఉగ్రవాద నాయకులను హతమార్చింది. ఇరాన్‌పైన కూడా 2025లో 12 రోజులు దాడి చేసింది. ఇదంతా గల్ఫ్‌లో ఉద్రిక్తలను తెలియజేస్తుంది. ఇక హూతీ రెబల్స్‌కు వ్యతిరేకంగా సౌదీ అరేబియా, అనుకూలంగా యూఏఈ కొట్టుకుంటున్నాయి. 2016 నుండి 2026 మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా 78 దేశాలు 61 యుద్ధాల్లో పాల్గొన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి.: రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్ సంఘర్షణలు ప్రపంచ శాంతికి ముప్పుగా పరిణమించాయి.రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నాటో దేశాలకు విస్తరించి, అణ్వస్త్ర దాడులకు దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.భారత్ చైనా (డోక్లాం, గల్వాన్) వంటి సరిహద్దు ఉద్రిక్తతలను ఎదుర్కొంటోంది. సాంప్రదాయ ఆయుధాలతో పాటు, సైబర్ దాడులు, సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలు (ఖతీనీజూజీణజీనిటజీ) కూడా ఈ యుగంలో భాగమయ్యాయిఇక సిరియా అంతర్యుద్ధం మొదట్లో తర్వాత టర్కీ సహకారంతో యుద్ధం చేస్తోంది. అమెరికా టర్కీ అనుకూల సున్నీ ప్రభుత్వం ఏర్పడేలా చేసింది. ఇజ్రాయెల్ దక్షణ సిరియాపై దాడి చేసింది.ఇక భారత్‌లో 2017లో డోక్లాం, 2020లో గల్వాన్ సంఘటన జరిగాయి. ఇవి పెద్ద యుద్ధాలు కాకపోయినా ఏళ్లపాటు సైన్యం మోహరించాల్సి వచ్చింది. 2025లో ఆపరేషన్ సిందూర్‌తో భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం జరిగింది. పాకిస్తాన్ శరణు వేడుకోవడంతో భారత్ ఆపరేషన్ సిందూర్‌ను హోల్డ్‌లో పెట్టింది. 2025లో ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌కు యుద్ధం జరిగింది. ఈ ఏడాది కూడా యుద్ధం కొనసాగుతోంది.ఆఫ్రికాలోనూ సూడాన్, సౌత్ సూడాన్, సోమాలియా, ఇథియోపియా, కాంగోలోనూ యుద్ధాలు జరుగుతున్నాయి. నార్త్ కొరియా, సౌత్ కొరియా, కంబోడియా, థాయ్‌లాండ్ మధ్య యుద్ధాలు సాధారణం అయ్యాయి. అజర్‌బైజాన్, ఆర్మేనియా మధ్య యుద్ధం జరిగింది. యుద్ధ రంగంలో తమ ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడే సైనికులు తీవ్రమైన శారీరిక, మానసిక అనుభవాలను ఎదుర్కొంటారు. మరణించిన వారి జీవితం అంతటితో సమసిపోయినా వారి కుటుంబాలకు అది చిరకాల బాధాకారణమౌతుంది. గాయపడినవారు మానసికంగాను, శారీరికంగాను, ఒకోమారు జీవితాంతం, అనేక వైకల్యాలతో బ్రతుకు గడపవలసి వస్తుందిజన నష్టంతో పాటు ఆస్తి నష్టం, ఆర్థిక వ్యవస్థ గందరగోళం, మానసిక వత్తిడులు సామాన్య జనానీకంపై ప్రగాఢమైన ప్రభావం కలిగి ఉంటాయి. నేరము, శిక్ష, ద్వేషం, జాతి వైరం, తెగింపు వంటి భావాలు సమాజాన్ని చాలాకాలం అంటిపెట్టుకొని ఉంటాయి.సమాజం ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతినే అవకాశం ఉంది. కోలుకోవడానికి సంవత్సరాలు లేదా దశాబ్దాలు పట్టవచ్చును. దేశ వనరులు చాలావరకు ప్రగతి నుండి సైనిక అవసరాలకు కేటాయింపబడవచ్చును.దేశంలో నెలకొన్న సంక్షోభం వల్ల, జనంలో రేకెత్తిన తీవ్ర భావాల వల్ల ప్రజలను రెచ్చ కొట్టే నాయకులు అధికారాన్ని హస్తగతం చేసుకొనే అవకాశం ఎక్కువవుతుంది.అణ్వాయుధాలు, రసాయనిక ఆయుధాలు, మందు పాతరలు వంటి వాటి వినియోగాల వల్ల ఆరోగ్యం, జీవనం అస్తవ్యస్తం కావచ్చును.2022లో యుద్ధం జరిగినప్పుడు అజర్‌బైజాన్ ఆధిపత్యం కనబర్చింది. 2023లో జరిగిన యుద్ధంలో 1.5 లక్షల మంది ఆర్మేనియాకు వెళ్లారు.మొత్తంగా 2016 నుంచి 2026 వరకు 61 యుద్ధాలు జరిగాయి. దీంతో మోదీ చేసిన ప్రకటన తప్పు అనిపిస్తుంది. భారత్ యుద్ధానికి సర్వదా సన్నద్ధంగా ఉంది. అందుకే గల్వాన్‌లో చైనాను, డోక్లాంలో చైనాను నిలువరించింది. మోదీకి ఏమాట చెప్పినా ఒక్కటి వాస్తవం. ప్రపంచంలో శాంతి కావాలంటే శక్తి ఉండాలి శస్త్రం కావాలి.

# ఏపీకి కొత్త సీఎం ప్రచారం...

విజయవాడ, మార్చి 10,

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం కష్టమే. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అంతా సాఫీగా సాగుతున్నట్లు కనిపిస్తున్నా, తెరవెనుక జరుగుతున్న సోషల్ మీడియా ప్రచారం మాత్రం పొలిటికల్ సెగలు పుట్టిస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరలో ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తారని, రాష్ట్ర పగ్గాలను తనయుడు లోకేష్‌కో లేదా మిత్రపక్ష నాయకుడు పవన్ కల్యాణ్‌కో అప్పగిస్తారనే విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి చంద్రబాబు కీలక మద్దతుదారుగా ఉండటంతో, ఆయనకు ఢిల్లీలో సముచిత స్థానం దక్కుతుందనేది కొందరి అంచనా. ఒకవేళ బాబు జాతీయ రాజకీయాలకు షిఫ్ట్ అయితే, రాష్ట్రంలో కొత్త నాయకత్వం అనివార్యమవుతుంది. అయితే, టీడీపీకి అసెంబ్లీలో స్పష్టమైన మెజారిటీ ఉన్నందున, సహజంగానే చంద్రబాబు తన వారసుడిగా నారా లోకేష్‌ను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టాలని భావిస్తారు. ఇప్పటికే లోకేష్ పరిపాలనలో చురుగ్గా ఉంటూ తనదైన ముద్ర వేస్తుండటం ఈ వాదనకు బలాన్నిస్తోంది.మరోవైపు, పవన్ కల్యాణ్ సీఎం కావాలనే డిమాండ్ ఆయన అభిమానుల నుంచే కాకుండా, ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వంటి వారి వ్యాఖ్యల ద్వారా కూడా చర్చకు వస్తోంది. రాజకీయాల్లో ఏదీ అసాధ్యం కాదు అన్న సూత్రాన్ని నమ్మేవారు పవన్ సీఎం అయ్యే అవకాశాలను కొట్టిపారేయడం లేదు. కూటమి గెలుపులో పవన్ పోషించిన కీలక పాత్రను దృష్టిలో ఉంచుకుని, చంద్రబాబు పెద్దమనసుతో ఆయనకు అవకాశం ఇస్తారా? అన్నది ఒక పెద్ద ప్రశ్న. అయితే, ఇది జరగాలంటే టీడీపీ ఎమ్మెల్యేల మద్దతు, ఆ పార్టీ అంతర్గత అంగీకారం తప్పనిసరి. చంద్రబాబు వంటి అనుభవజ్ఞుడైన నేత రాష్ట్రం నుంచి తప్పుకుంటే కూటమిలో నాయకత్వ సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్న అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక , అభివృద్ధి సవాళ్లను ఎదుర్కోవాలంటే బాబు అనుభవం అత్యవసరం. కేవలం వారసత్వం కోసమో లేదా మిత్రపక్షాల కోసమో సీఎం పదవిని వదులుకోవడం అంత సులభమైన నిర్ణయం కాకపోవచ్చు. లోకేష్ మరియు పవన్ మధ్య అధికార పంపిణీ విషయంలో ఏ చిన్న తేడా వచ్చినా అది కూటమి భవిష్యత్తును ప్రభావితం చేయవచ్చు.అసలు కూటమి పార్టీల మధ్య ఈ విషయంపై అధికారికంగా ఎలాంటి చర్చ జరగకపోయినా, ప్రతిపక్షాల విమర్శలు, సోషల్ మీడియా విశ్లేషణలు ప్రజల్లో అయోమయాన్ని కలిగిస్తున్నాయి. బాబు ఢిల్లీకి వెళ్తారా? లోకేష్‌కి పట్టాభిషేకం చేస్తారా? లేక పవన్‌ను సీఎం కుర్చీలో కూర్చోబెట్టి కింగ్ మేకర్‌గా నిలుస్తారా? అన్నది కాలమే నిర్ణయించాలి. ఏది ఏమైనా, ఈ సీఎం కుర్చీ వార్తలు మాత్రం ఏపీ రాజకీయాల్లో కొత్త రకమైన ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి.

# కొవ్వూరు -జీలుగుమిల్లి మధ్య 368 కోట్లతో హైవే

కాకినాడ, మార్చి 10

తూర్పు గోదావరి జిల్లాలోని కొవ్వూరు- ఏలూరు జిల్లా లోని జీలుగుమిల్లి మధ్య 86.7 కిమీ ల హైవే కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది కేంద్రం. రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు మాజీ కేంద్రమంత్రి దగ్గుపాటి పురంధ్రీశ్వరి ఈ వివరాలు తెలిపారు. మొత్తం 368కోట్ల రూపాయలతో నిర్మించే ఈ డబుల్ లైన్ హైవే ఏజెన్సీ గ్రామాలకూ, పోలవరం ప్రాజెక్ట్ కూ చాలా రకాలుగా ఉపయోగపడనున్నట్టు ఆమె ప్రకటించారు.ఆల్రెడీ కొవ్వూరు నుండి గోదావరి గట్టు వెంబడి పోలవరం వరకూ ఒకరోడ్డు, పోలవరం నుండి జీలుగుమిల్లి వరకూ మరొక రోడ్డు ఉన్నాయి. అయితే ఇవి సింగిల్ లైన్ రోడ్లు. రవాణా సౌకర్యం కూడా తక్కువే. ఇప్పుడు ఆ రెండు రోడ్లనూ కలుపుతూ ఒకే రోడ్డు క్రింద మార్చబోతున్నారు.మొత్తం 86.7 కిమీ పొడవైన ఈ రోడ్డు కొవ్వూరు లోని గోదావరి మాత విగ్రహం నుండి మొదలై గోదావరి పై నిర్మించిన గామన్ బ్రిడ్జ్ క్రింద నుండి పట్టిసీమ,పోలవరం మీదుగా జీలుగుమిల్లి వరకూ వెళుతుంది. ఈ రూట్ లో 30 మైదాన గ్రామాలు, 100 ఏజెన్సీ గ్రామాలు కవర్ అవుతాయి.ఆయా ప్రాంతాల స్టూడెంట్స్, ఉద్యోగులు, చిన్నకారు వ్యాపారస్తులు, వ్యవసాయ దారులకు ఈరోడ్డు మెరుగైన ట్రాన్స్ పోర్ట్ సౌకర్యం కలిగిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. క్రొత్త గా వచ్చే ఈ హైవే వలన హైదరాబాద్ -విశాఖపట్నం మధ్య మరింత దూరం తగ్గనుంది. ఈ హైవే పూర్తి అయితే ఆల్రెడీ నిర్మాణం చివరి దశ లో ఉన్న ఖమ్మం -దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే కి మరొక ప్రత్యామ్నాయం వచ్చినట్టే అవుతుంది. పోలవరం మీదుగా 2 లేన్లతో అనుమతికొవ్వూరు -జీలుగుమిల్లి రెండు వరుసలు హైవే చాలా టూరిస్ట్ ప్రాంతాలను కవర్ చేస్తూ వెళు తుంది. వాటిలో 200ల సినిమా షూటింగ్ లు జరుపుకున్న సినిమా చెట్టు ఉండే కుమారదేవం, పట్టిసీమ ప్రాజెక్టు, పట్టిసీమ టెంపుల్, పోలవరం ప్రాజెక్టు లతో పాటు పోలవరం -జీలుగుమిల్లి మధ్య ఉన్న ఏజెన్సీ (అటవీ ప్రాంతాలు ) గ్రామాలు ఉన్నాయి. ఈ హైవే వల్ల ట్రాన్స్ పోర్ట్ తో పాటు టూరిజం కూడా డెవలప్ అవుతుంది అని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ హైవే పూర్తి అయితే ఇది పోలవరం ప్రాంతాల అభివృద్ధి కి గేమ్ చేంజర్ అవుతుందని అక్కడి ప్రజలు అంటున్నారు.ఖమ్మం నుండి దేవరపల్లి మధ్య రెడీ అవుతోన్న గ్రీన్ ఫీల్డ్ హైవే కొవ్వూరు కి 20కిమీ దూరం లోనే ఉండబోతోంది. అడిగాక చెన్నై -హౌరా నేషనల్ హైవే కూడా కొవ్వూరు పై నుండే వెళుతోంది. వీటి జతకి క్రొత్తగా కొవ్వూరు -జీలుగుమిల్లి హైవే కూడా శాంక్షన్ కావడం తో కొవ్వూరు అభివృద్ధి స్కై రేకెట్ వేగంతో ముందుకి వెళుతుంది అని అక్కడి ప్రజలు అంటున్నారు.

# కాపు కాసేవారెవరు...

ఏలూరు మార్చి 10,

ఏపీ రాజకీయాల్లో కులం అనేది కీలకం. కుల సమీకరణలే ఈ రాష్ట్రంలో ప్రధానంగా కీలక భూమిక పోషిస్తాయి. ముఖ్యంగా కాపు సామాజిక వర్గం ఎటు ఉంటే అటు మొగ్గు ఉంటుంది. ఆ పార్టీ అధికారానికి చేరువ అవుతుంది. అందుకే ఎన్నికలు వచ్చిన ప్రతిసారి కాపు సామాజిక వర్గం ఈక్వేషన్స్ తెరపైకి వస్తాయి. మొన్నటి ఎన్నికల్లో సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి భారీ ప్లాన్ వేశారు. కాపు నేతలను అడ్డం పెట్టుకుని పవన్ కళ్యాణ్ ఇమేజ్ ను డామేజ్ చేయాలని చూశారు. తద్వారా కాపు సామాజిక వర్గం ఓట్లను చీల్చాలని చూశారు. కానీ అది ఎంత మాత్రం వర్కౌట్ కాలేదు. తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ డ్యామేజ్ చేసింది. మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణ ఓటమికి అదే ప్రధాన కారణం.సరిగ్గా ఎన్నికలకు ముందు ముద్రగడ పద్మనాభం(లాంటి కాపు నేతలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి రప్పించారు. పవన్ కళ్యాణ్ పై దారుణ విమర్శలు చేయించారు జగన్. కానీ క్షేత్రస్థాయిలో జగన్ వేసిన ఈ ప్లాన్ లు అన్ని అట్టర్ ప్లాఫ్ అయ్యాయి. అయితే పవన్ కళ్యాణ్ మాత్రం అత్యంత చాకచక్యంగా వ్యవహరించి తాను అనుకున్నది సాధించారు. ఒక ప్లాన్ లో భాగంగానే ముద్రగడ పద్మనాభాన్ని అస్త్రంగా ప్రయోగించారు జగన్. కాపు ఉద్యమ నేతగా ముద్రగడ పద్మనాభంతో విమర్శలు చేయిస్తే ఆ సామాజిక వర్గంలో చీలిక వస్తుందని అనుకున్నారు. పవన్ కళ్యాణ్ అంటే ఒక నటుడిగా, ప్యాకేజీ స్టార్ గా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. అక్కడే జగన్ ప్రణాళిక విడిసి కొట్టింది. ముద్రగడ లాంటి సీనియర్ నేత తన స్థాయిని మరిచి పవన్ పై విమర్శలు చేయడాన్ని కాపు యువత తట్టుకోలేకపోయింది. పైగా పవన్ కళ్యాణ్ ను ఓడించకపోతే తన పేరును పద్మనాభ రెడ్డి గా మార్చుకుంటానని సవాల్ చేయడం కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఒక ఎదురుదెబ్బ అని చెప్పవచ్చు.ప్రస్తుతం కూడా కాపు సామాజిక వర్గంలో చీలిక తేవాలన్నది జగన్మోహన్ రెడ్డి ప్రణాళిక. ఎన్నెన్నో రెచ్చగొట్టే ప్రకటనలు వైసీపీ కాపు నేతల నుంచి వస్తున్నాయి. కానీ పవన్ కళ్యాణ్ మాత్రమే ఎక్కడా స్పందించడం లేదు. తన లక్ష్యం నుంచి పక్కకు జరగలేదు. గత అనుభవాలను గుణపాఠాలుగా మార్చుకొని కూటమి బలోపేతం చేయడం పై ఫుల్ ఫోకస్



పెట్టారు. జగన్ కాపు నేతలతో చేయిస్తున్న విమర్శలకు.. పవన్ తన మాటలతో సమాధానం చెప్పడం లేదు. ఓట్ల రూపంలో బుద్ధి చెబుతున్నారు. పాలు తగ్గిన పర్వాలేదు కానీ వైసీపీని గద్దె దించడమే పరమావధిగా అప్పుడు అడుగులు వేశారు. ఇప్పుడు ఎట్టి పరిస్థితుల్లో వైసిపికి అధికారం దక్కకుండా అవసరమైతే తాను తగ్గుతానని సంకేతాలు ఇస్తున్నారు. ఇలా ఎలా చూసుకున్నా పవన్ కళ్యాణ్ ఉండగా జగన్మోహన్ రెడ్డి కాపు వ్యూహాలు అట్టర్ ప్లాఫ్ అవ్వక తప్పదు.

# తగ్గేది లేదంటున్న కొలికపూడి

విజయవాడ, మార్చి 10,

టీడీపీలో కొలికపూడి చిచ్చు తగ్గడం లేదు. అమరావతి ఉద్యమకారుడు ఇప్పుడు టీడీపీకి మింగుడుపడని నేతగా మారారు. విజయవాడ ఎంపీని చూపించి ఆయన టీడీపీని టార్గెట్ చేస్తున్నారన్న ఆగ్రహం కనిపిస్తోంది.తెలుగుదేశం పార్టీలో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యవహారం ప్రస్తుతం ఒక పెను తుఫానును సృష్టిస్తోంది. అమరావతి పరిరక్షణ ఉద్యమం నుండి పుట్టిన నాయకుడిగా, చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో అసెంబ్లీలో అడుగుపెట్టిన ఆయన, ఇప్పుడు అదే పార్టీకి అతిపెద్ద సమస్యగా పరిణమించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తో విభేదాలను సాకుగా చూపుతూ, ఆయన సాగిస్తున్న విమర్శలు నేరుగా పార్టీ ప్రతిష్ఠనే దెబ్బతీస్తున్నాయని ఆ పార్టీ అగ్రనేతలు మండి పడుతున్నా ఏమీ చేయలేకపోతున్నారు. అమరావతి ఉద్యమ సమయంలో పోరాట పటిమను చూసి, స్థానిక నేతల వ్యతిరేకత ఉన్నప్పటికీ తిరువూరు నుంచి చంద్రబాబు ఆయనకు టికెట్ ఇచ్చి గెలిపించుకున్నారు. అయితే, గెలిచిన నాటి నుండి కొలికపూడి తన బాణాలను ప్రత్యర్థులపై కాకుండా సొంత పార్టీ నేతలపైనే గురిపెడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో లేని భయం ఇప్పుడు ఉందంటూ ఆయన చేస్తున్న వ్యాఖ్యలు టీడీపీకి తీరని నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఇది కేవలం ఎంపీతో ఉన్న పట్టింపుల వల్ల చేస్తున్న విమర్శలు కాదని, పార్టీని టార్గెట్ చేయడమే ఆయన ప్రధాన లక్ష్యమని కేడర్ భావిస్తోందిఅమరావతి ఉద్యమానికి ముందు కొలికపూడి వైసీపీ సానుభూతిపరుడిగా ఉండేవారన్న గతాన్ని ఇప్పుడు టీడీపీ శ్రేణులు గుర్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఆయన అనుసరిస్తున్న తీరును బట్టి, ఆయనను జగన్ కోవర్ట్ గా సోషల్ మీడియాలోనూ, అంతర్గత చర్చల్లోనూ సంబోధించడం మొదలైంది. జగన్ హయాంలో రక్షణ ఉందని, ఇప్పుడు బెదిరింపులు వస్తున్నాయని ఆయన అనడం వెనుక లోతైన రాజకీయ అర్థం ఉందని, ఇది ప్రత్యర్థులకు ఆయుధాలను అందించడమేనని పార్టీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.ఇంత వివాదం జరుగుతున్నా నారా లోకేష్



ఆయనను విందుకు ఆహ్వానించడం, పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నచ్చజెప్పే ప్రయత్నం చేయడం వెనుక బలమైన కారణాలు ఉండవచ్చునని చెబుతున్నారు. ఒక దళిత ఎమ్మెల్యేపై కఠిన చర్యలు తీసుకుంటే అది వర్గపరంగా తప్పుడు సంకేతాలు వెళ్తుందనే ఆందోళన ఒకటైతే, అమరావతి ఉద్యమకారుడిగా ఆయనకున్న గుర్తింపు వల్ల వెంటనే చర్యలు తీసుకోవడానికి అధిష్ఠానం వెనుకాడుతోందని చెబుతున్నారు. ఈ వెసులుబాటుతో ఆయన పార్టీ క్రమశిక్షణను గాడి తప్పిస్తున్నారన్న విమర్శలు కూడా వస్తున్నాయికొలికపూడి వైఖరి వల్ల పార్టీ క్యాడర్ నైతిక స్థైర్యం దెబ్బతింటోంది. ఒక ఎమ్మెల్యే బహిరంగంగా పార్టీ విధానాలను తప్పుబట్టడం క్రమశిక్షణారాహిత్యానికి పరాకాష్ట అని క్షేత్రస్థాయి కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. చర్యలు తీసుకుంటే ఆయనను బాధితుడిగా చూపి ప్రతిపక్షం రాజకీయం చేసే అవకాశం ఉన్నప్పటికీ, తీసుకోకపోతే అంతర్గత నష్టం మరింత పెరిగే ప్రమాదం ఉంది. పార్టీ కన్నా ఎవరూ ఎక్కువ కాదని నిరూపించాల్సిన బాధ్యత ఇప్పుడు చంద్రబాబు నాయుడిపైనే ఉంది. ఎప్పటికప్పుడు ఆయన అంతా సర్దుబాటు అయిందన చెబుతున్నప్పటికీ ఒక్క రోజు కూడా ఈ సర్దుబాటు ఉండటం లేదు.

# జనసేన ఆవిర్భావదినోత్సవ సభ రద్దు

గుంటూరు మార్చి 10,

ప్రతి ఏడాది జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు ఎంత గ్రాండ్ గా చేస్తారో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. లక్షల సంఖ్యలో కార్యకర్తలను పోగు చేసి, కనీవినీ ఎరుగని రీతిలో ఈ సభని నిర్వహిస్తూ రావడం ఆనవాయితీగా మారింది . ఈ ఏడాది కూడా ఈ సభని గ్రాండ్ గా నిర్వహించాలని అనుకున్నారు. ఈ సభకు 'జెన్ జీ ' అని పేరు కూడా పెట్టాలని అనుకున్నారు. గత ఏడాది లాగానే , ఈ ఏడాది కూడా పిఠాపురం లోనే ఈ బహిరంగ సభని నిర్వహించడానికి ప్లాన్ చేశారు. కానీ ఇప్పుడు ఆ ఆలోచనని పూర్తిగా పక్కన పెట్టినట్టు తెలుస్తోంది. కారణం బిజీ షెడ్యూల్స్ వల్ల అని తెలుస్తోంది. ఆయన హీరో గా నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్ ' చిత్రం ఈ నెల 19 న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుందిఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ గత మూడు రోజుల నుండి ఈ సినిమాకు సంబందించిన డబ్బింగ్ కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. అంతే కాకుండా ప్రీ రిలీజ్ ఈవెంట్ ని ఈ నెల 15 న హైదరాబాద్ లోని యూసఫ్ గూడా పెరేడ్ గ్రౌండ్స్ లో గ్రాండ్ గా నిర్వహించబోతున్నారు. బాగా టైట్ షెడ్యూల్ , పైగా సభకు ఎలాంటి ఏర్పాట్లు కూడా ప్రీ ప్లాన్ గా చేసుకోలేదు.

# బెంగాల్‌లో వ్యూహాలు... ప్రతి వ్యూహాలు...

కోల్ కత్తా, మార్చి 10,

పశ్చిమ బెంగాల్‌లో కొత్తగాలి వీస్తోంది. అక్కడ రాజకీయాల్లో పెద్ద మార్పు రాబోతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న మమతా బెనర్జీకి ఎదురుగాలి వీస్తోంది. దీంతో అమె ఫ్రస్టేషన్‌కు గురవుతున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు కష్టాలు ఎదుర్కొంటోంది. దీంతో పార్టీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ మానసిక ఒత్తిడి, ఫ్రస్టేషన్‌కు గురవుతున్నారు. ఇది ఆమె వ్యవహారాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. కేంద్రం నిర్ణయాలను వ్యతిరేకించడం, సర్ విషయంలో ఆందోళన చేయడం, ఈసీపై సుప్రీం కోర్టును ఆశ్రయించడం, ఆందోళనలు చేయడం, రాష్ట్రపతి పదవిపై అవాకులు మాట్లాడటం, ప్రొటోకాల్ పాటించకపోవడం వంటివి ఇందుకు నిదర్శనాలు. ఈ పద్ధతి ఆమె ఆవేశంలో ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నట్లు సూచిస్తోంది. మరోవైపు, రాజకీయంగా మమతా చిన్న అంశాలను భారీ సమస్యలుగా మార్చే ప్రయత్నం చేస్తోంది. 'బెంగాలీ, నాన్ బెంగాలీల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. వందేభారత్ రైళ్లలో నాన్?వెజ్ మీల్స్ అంశాన్ని పెద్ద సమస్యగా చిత్రీకరిస్తున్నారు.ఇక బీజేపీ 2015 నుంచి బెంగాల్ అధికారం కోసం కఠిన పోరాటం చేస్తోంది. ఇప్పుడు ఫలితాలు కనిపించడం మొదలైంది. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చిన బీజేపీ, మమతా 'ట్రాప్'లకు దూరంగా తమ స్వంత మార్గంలో ముందుకు సాగుతోంది. యువతలో నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు లేకపోవడం, పేదరికం, రాష్ట్ర అభివృద్ధి స్థిరంగా లేకపోవడం, మతోన్మాదం వంటి రాష్ట్ర?నిర్దిష్ట సమస్యలపై దృష్టి పెట్టింది. 'పరివర్తన్ యాత్ర' పేరిట 5 వేల కిలోమీటర్ల విస్తృత ప్రచార యాత్ర చేపట్టారు. 9 ప్రాంతాల నుంచి 9 మంది కీలక నాయకులు ఈ యాత్రను నడుపుతున్నారు, ప్రతీ గ్రామం, ప్రతీ పల్లెను తాకేలా రూపొందించారు. ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా, సామాజిక వర్గాల డేటాను ఉపయోగించి మైక్రో?లెవల్ ప్లానింగ్ చేస్తోంది. ఇది గ్రామ, మండల స్థాయిలో టార్గెటెడ్ ప్రచారానికి దోహదపడుతోంది.ఐదు కీలక జిల్లాలు పురూలియా, పశ్చిమ మిద్నాపూర్, పశ్చిమ వర్ధమాన్, చార్‌గామ్, బాంకురాలో ఓ సంస్థ ప్రజల మూడ్ తెలుసుకునేందుకు సర్వే చేసింది. ఇందులో బీజేపీకి అనుకూల ఫలితాలు వచ్చాయి. పురూలియా జిల్లాలో గత ఎన్నికల్లో బీజేపీ 6 సీట్లు, టీఎంసీ 3 సీట్లు. తాజా సర్వేలో 6 సీట్లు మళ్లీ బీజేపీకి, మిగిలిన 3 సీట్లలో కొద్ది కష్టపడితే క్లీన్ స్వీప్ చేసే అవకాశం ఉంది. పశ్చిమ మిద్నాపూర్ జిల్లాలో 15 సీట్లు ఉండగా, గతంలో బీజేపీ 2 సీట్లు గెలిచింది. ఇప్పుడు 5 సీట్లు గెలవడానికి మంచి అవకాశం ఉంది. చార్‌గామ్ జిల్లాలో గతంలో బీజేపీకి ఒక్క సీటు కూడా లేదు.. ఈసారి మూడు స్థానాలు దక్కించుకునే అవకాశం ఉంది. బాంకురా జిల్లాలో గతంలో 8 సీట్లు గెలిచిన బీజేపీ ఇప్పుడు 12 సీట్ల వరకు ఆధిక్యం కనబరుస్తోంది. పశ్చిమ వర్ధమాన్ జిల్లాలోనూ బీజేపీ బలపడుతోంది. మొత్తంగా ఉత్తర బెంగాల్‌లో బీజేపీ స్పష్టమైన ఎడ్జ్‌తో ముందంజలో ఉంది.బెంగాల్ బీజేపీకి ఇంతకాలం కొరకరాని కొయ్యలా మారింది. ఈసారి మాత్రం యాత్రలు, మైక్రో?స్ట్రాటజీలు గాలి మార్పును స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఈ ట్రెండ్ మరింత బలపడనుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మమతా ప్రభుత్వంపై ప్రజల అసంతృప్తి, బీజేపీ ప్రచార బలం 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పెద్ద పరివర్తనకు దారి తీసే అవకాశం ఉంది.

# విజయ్... ఒంటరేనా...

చెన్నై, మార్చి 10,



అరవ రాజకీయాల్లో తలపతి విజయ్ గురించి ఇప్పుడిలాంటి చర్చే జరుగుతోంది. ఎంట్రీ జరిగినంత అలవోకగా.. ఆయన పొలిటికల్ ప్రయాణం సాగడం లేదు. ఎంత సూపర్ స్టార్ అయితే ఏంటి.. తమిళ వెట్రి కళగం అధినేతకు పట్టపగలు చుక్కలు కనిపిస్తున్నట్టే ఉంది పరిస్థితి. అన్నీ సగంలోనే.. అంతా సగంలోనే.. బీస్ట్ రోస్ట్ అన్నట్టుగా మారింది తలపతి సిట్యుయేషన్. అటు ఆఖరి సినిమా.. ఇటు కొత్తగా పొలిటికల్ జర్నీ.. మరోవైపు సీబీఐ కేసులు.. ఇంకోవైపు ఫ్యామిలీ ఇష్యూస్? ఇలా నలుదిక్కులు నాన్‌స్టాప్ కష్టాలు అన్నట్టుగా ఉన్నాయ్ పరిస్థితులు. ఏ దిక్కు నుంచి ఎప్పుడు ఏ పిడుగు పడుతుందో అర్థం కావట్లేదు ఈ రీల్ హీరోకి..!సినిమాలు వదిలేసి రాజకీయం చేద్దామని వచ్చిన విజయ్.. ఇప్పటికీ పార్టీ నిర్మాణంపై దృష్టిపెట్టలేదు. ఎక్కడికెళ్లినా కుప్పలు తెప్పలుగా తరలివస్తున్న అభిమాన గణమే తప్ప?. పార్టీ వ్యవస్థీకృత నిర్మాణం ఇంకా పూర్తిగా జరగలేదు. ఎన్నికలేమో.. ఎంతో దూరంలో లేవు. దీంతో, పైస్థాయి నాయకత్వమే తప్ప.. కింది స్థాయిలో పార్టీని పటిష్ట పరిచే పరిస్థితులు ఏమాత్రం కనిపించడం లేదు. కేవలం విజయ్ ఇమేజ్ మాత్రమే ఇప్పటికీ టీవీకే ప్రధాన బలంగా తెలుస్తోంది. అంతేకాదు, ఎన్నికల్లో కలిసి వెళ్లే పొత్తులు కూడా లేక.. ఒంటరిగా మిగిలిపోయింది టీవీకే పార్టీ. ఈ పరిస్థితుల్లో వచ్చే ఎన్నికలను విజయ్ ఎలా ఎదుర్కొంటారన్నది పొలిటికల్ వర్గాల్లో ఆసక్తిరేపుతోంది.ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో వర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ.. అదే వేదికపై ఎన్నికల హామీలు ప్రకటిస్తూ.. కొత్త పంథాలో ముందుకు సాగుతున్నారు. అయితే, ఈ విషయంలో పరోక్షంగా విజయ్‌ని టార్గెట్ చేస్తూ.. కీలక వ్యాఖ్యలు చేశారు తమిళనాడు సీఎం స్టాలిన్. ఎన్నికల హామీలను కొందరు ఇన్‌స్టాల్మెంట్స్‌లో ప్రకటిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. డీఎంకే పథకాలను కాపీ కొడుతున్నారంటూ విమర్శలు గుప్పించారు.రాజకీయంగా ఇలా ఉంటే.. మరోవైపు ఇండస్ట్రీ పరంగానూ.. ఇరకాటంలో పడిపోయారు విజయ్. ఒకప్పుడు విజయ్ సినిమా రిలీజ్ అవుతోందంటే.. కోలివుడ్‌లో ఉండే హడావుడి అంతా ఇంతా కాదు. రాజకీయరంగ ప్రవేశం చేస్తూనే సినిమాలకు గుడ్‌బై చెప్పిన విజయ్.. చివరి సినిమా జననాయగన్‌తో సిల్వర్ స్క్రీన్‌ని చించేద్దామనుకున్నారు. పొలిటికల్‌గానూ మైలేజ్ గెయిన్ చేయాలనుకున్నారు. కానీ, దానికి కూడా పరిస్థితులు అనుకూలించడం లేదు. సెన్సార్ బోర్డు చెక్ పెట్టేసింది. దీంతో, జననాయగన్ విడుదలే కన్ఫ్యూజన్‌గా మారింది. ప్రత్యేక సెన్సార్ స్క్రీనింగ్ మరోసారి వాయిదా పడి, మార్చి 17కు రీ షెడ్యూల్ కావడంతో.. ఇప్పుడీ సినిమా విడుదలవడమే సస్పెన్స్‌గా మారింది.41మంది ప్రాణంపోవడానికి కారణమైన కరూర్ తొక్కిసలాట ఘటన కూడా? విజయ్‌కే కాదు, ఆయన పార్టీకి కూడా రాచపుండులా తయారైంది. ఈ కేసు విచారణలో అఃఎ స్పీడు పెంచింది. ఇప్పటికే ఆయనను రెండుసార్లు విచారించిన దర్యాప్తు సంస్థ? మరోసారి విచారణకు హాజరు కావాలంటూ.. విజయ్‌కి నోటీసులు ఇచ్చింది. దీంతో, తమిళ రాజకీయాల్లో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే ఈ ఇష్యూలో ప్రత్యర్థులు విజయ్‌పై ముప్పేట దాడి చేస్తున్న వేళ? సీబీఐ మరింత స్పీడు పెంచడం కీలకంగా మారింది. అయితే, దర్యాప్తు సంస్థ నోటీసులపై స్పందించిన విజయ్.. 10రోజులు సమయం కావాలని అడిగినట్టు తెలుస్తోంది. దీంతో? తదుపరి విచారణ ఎప్పుడనే దానిపై? ఉత్కంఠ ఏర్పడింది!ఇంటగెలిచి రచ్చగెలవాలనే పెద్దల మాట? ఇప్పుడు విజయ్ విషయంలో కీలకంగా మారింది. అన్నీ ఒకెత్తయితే.. తన ఫ్యామిలీ నుంచి ఎదురవుతున్న పాట్లు అంతకంతకూ పెరుగుతున్నాయ్. విజయ్‌తో విడాకులు కావాలంటూ.. ఇప్పటికే చెంగల్‌పట్టు కోర్టులో పిటిషన్ వేసిన భార్య సంగీత? ఇటీవల మరో అనుబంధ పిటిషన్ వేశారు. తనను విజయ్ ఇంట్లో ఉండనివ్వాలన్న సంగీత? న్యాయపరమైన భరణం ఇప్పించాలంటూ కోర్టును అభ్యర్థించారు. ఓ నటితో సన్నిహితంగా ఉంటూ.. కుటుంబాన్ని విజయ్ పట్టించుకోవడం లేదంటూ తీవ్ర ఆరోపణలు చేసిన సంగీత? మరో అనుబంధ పిటిషన్‌ని కూడా దాఖలు చేయడం? తలపతిని తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. కుటుంబం విచ్ఛిన్నమై.. ఒక్కొక్కరు ఒక్కో చోట అన్నట్టుగా మారింది విజయ్ పరిస్థితి. మరి, బీస్ట్ రోస్ట్‌లా మారిన పరిస్థితులను? విజయ్ ఎలా అధిగమిస్తారన్నదే ఇప్పుడు రాజకీయంగా ఆసక్తిరేపుతోంది.

# భారత్‌లో షా విద్యాభ్యాసం..

న్యూఢిల్లీ, మార్చి 10,

నేపాల్ పార్లమెంటు ఎన్నికలు ముగిశాయి. ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. బ్యాలెకట్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించడంతో కౌంటింగ్ ఆలస్యం అవుతోంది. ఇప్పటి వరకు అందిన ఫలితాల ప్రకారం? జెన్ జీ ఉద్యమనేత బాలెన్ షా నేతృత్వంలోని ఆర్‌ఎస్‌పీ పార్టీ 104 సీట్లు గెలిచింది. ప్రభుత్వం ఏర్పాటుకు 165 స్థానాలు కావాలి. ఆర్‌ఎస్‌పీ ప్రస్తుతం మరో 21 స్థానాల్లో లీడింగ్‌లో ఉంది. మొత్తంగా 130 స్థానాలు గెలిచే అవకాశం ఉంది. కలిసి వచ్చే పార్టీలతోకలిసి బాలెన్‌షా ప్రభుత్వం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి ఫలితాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.బాలెన్‌షా గతేడాది జెన్‌జీ ఉద్యమం ద్వారా వెలుగులోకి వచ్చాడు. యువ నాయకుడు నేపాల్‌లో అధికారంలో ఉన్న నేతలు, వారి పిల్లలు అనుభవిస్తున్న రాజభోగాలకు వ్యతిరేకంగా ఉద్యమించాడు. అయితే బాలెన్ షా భారత్‌లోని బెంగళూరులోని విశ్వేశ్వరయ్య టెక్నికల్ యూనివర్సిటీలో ఉన్నత విద్య అభ్యసించాడు. జెన్‌జీ ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ ఎన్నికల్లో సంప్రదాయ పార్టీలకు షాక్ ఇచ్చాడు1990 ఏప్రిల్‌లో బాలెంద్ర షా(బాలెన్) కాఠ్మాండులో పెరిగాడు. స్ట్రక్చరల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ తర్వాత రాప్ సంగీతంతో యువతను ఆకట్టుకున్నాడు. అవినీతి వ్యతిరేక పాటలు, స్వతంత్ర దృక్పథంతో సోషల్ మీడియాలో లక్షలాది ఫాలోవర్లు సంపాదించాడు. 2016?18 మధ్య బెంగళూరులోని విశ్వేశ్వరయ్య టెక్నికల్ యూనివర్సిటీలో ఎంటెక్ పూర్తి చేశాడు. భారత విద్యా వ్యవస్థ ఆయన సాంకేతిక, ఆలోచనా సామర్థ్యాన్ని బలోపేతం చేసింది.2022లో కాఠ్మాండు మేయర్‌గా స్వతంత్రంగా గెలిచి అక్రమ ఆక్రమణలు, రోడ్లు, నీటి సమస్యలపై కఠిన చర్యలు తీసుకున్నాడు. ఇప్పుడు రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయికి ఎదిగాడు. ఆయనకు ఇన్‌స్టాగ్రామ్‌లో 10 లక్షల మందికిపైగా ఫాలోవర్లు ఉన్నారు.మార్చి 5న జరిగిన ఎన్నికల్లో ఆర్‌ఎస్‌పీ అధికార పీఠం దిశగా ముందుకు సాగుతోంది. జాపా నుంచి పోటీ చేసిన బాలెన్ 68,348 ఓట్ల రికార్డు మెజారిటీతో గెలిచాడు. మాజీ ప్రధాని కేపీ. శర్మ ఓలిని 49,614 ఓట్ల తేడాతో ఓడించాడు. బాలెన్ జాతీయవాది గ్రేటర్ నేపాల్ మ్యాప్‌తో కాలాపానీ, లిపులేఖ్ వివాదాలు లేవనెత్తాడు. అయితే సమతుల్య విదేశాంగ విధానం, ఓపెన్ బోర్డర్ వాణిజ్యం, జలవిద్యుత్ ప్రాజెక్టులు, అగ్నివీర్ సమస్యల పరిష్కారానికి అవకాశాలు ఉన్నాయి.

# సంక్షేమ పథకాలకే 56 వేల కోట్లు

హైదరాబాద్, మార్చి 10,

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు కేవలం అంకెల గారడీగా కాకుండా, అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ రణక్షేత్రంగా మారబోతున్నాయి. ఒకవైపు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శ్వేతపత్రం డిమాండ్‌తో సర్కారును కార్నర్ చేస్తుంటే, మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ప్రభుత్వ అప్పుల చిట్టాను విప్పుతూ ఎదురుదాడికి దిగుతున్నారు. సుమారు 3 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు కసరత్తు జరుగుతున్న వేళ, రాష్ట్ర ఖజానా అసలు స్థితిగతులపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సంక్షేమం స అభివృద్ధి మధ్య సమతూకం పాటించడం ఇప్పుడు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు కత్తిమీద సాములా మారింది.రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అప్పుల ఊబి వేధిస్తోంది. గత పదేళ్లలో అప్పులు రూ.7.5 లక్షల కోట్లకు చేరాయని ముఖ్యమంత్రి ఆరోపిస్తుండగా, అధికారిక లెక్కలు భిన్నంగా ఉన్నాయి. అయితే, ఏ లెక్క చూసినా నెలకు వేల కోట్ల రూపాయలు కేవలం వడ్డీల చెల్లింపులకే వెచ్చించాల్సి వస్తోంది. ఈ డెట్ ట్రాప్ నుంచి బయటపడి, కొత్త ప్రాజెక్టులకు నిధులు మళ్లించడం ప్రభుత్వానికి అతిపెద్ద సవాలు. అప్పు తెచ్చి పప్పు కూడు అన్నట్లుగా కాకుండా, ఆదాయ వనరులను పెంచుకోవడమే ఏకైక మార్గమని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలు బడ్జెట్‌లో సింహభాగాన్ని ఆక్రమించనున్నాయి. రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి వంటి పథకాల అమలుకు ఏటా రూ. 56,000 కోట్ల పైచిలుకు నిధులు అవసరమని అంచనా. ఎన్నికల వాగ్దానాలను నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉన్న ప్రభుత్వం, ఈ నిధుల కోసం ఇతర శాఖల కేటాయింపుల్లో కోత విధిస్తుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తూనే, మౌలిక సదుపాయాలను విస్మరించకూడదనే ఒత్తిడి సర్కారుపై ఉంది.రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడి వ్యయం విషయంలో ప్రభుత్వం కొంత వెనుకబడి ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బడ్జెట్‌లో రూ. 36,000 కోట్లు కేటాయించినా, క్షేత్రస్థాయిలో ఖర్చు ఎంత అన్నదే కీలకం. జీతాలు, పెన్షన్లు వంటి రెవెన్యూ వ్యయం భారంగా మారుతున్న తరుణంలో, సాగునీటి ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం వంటి ఆస్తుల సృష్టికి నిధులు తగ్గిస్తే దీర్ఘకాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంది. సంక్షేమంతో పాటు సంపద సృష్టిని కూడా సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం నెరవేరాలంటే, ఆదాయ మార్గాలను గణనీయంగా పెంచుకోవాలి. అటవీ, ఎక్సైజ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు కేంద్రం నుంచి రావాల్సిన పన్నుల వాటా, గ్రాంట్లపై రాష్ట్రం ఆశలు పెట్టుకుంది. కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే నిధులు రాబట్టుకోవడం రాజకీయంగానూ, ఆర్థికంగానూ ఇప్పుడు అనివార్యం. ఈ బడ్జెట్ సమావేశాలు తెలంగాణ ఆర్థిక దిశను నిర్దేశించనున్నాయి. కిషన్ రెడ్డి డిమాండ్ చేసినట్లుగా ప్రభుత్వం పారదర్శకంగా వివరాలు వెల్లడిస్తుందా? లేక రాజకీయ ఆరోపణలకే పరిమితమవుతుందా అన్నది చూడాలి. సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచుతూనే, ఆర్థిక క్రమశిక్షణను పాటించడమే రేవంత్ సర్కార్ ముందున్న అసలైన పరీక్ష.

# గవర్నర్ మార్పు...అధికారమే లక్ష్యం

హైదరాబాద్, మార్చి 10,

తెలంగాణ రాజ్‌భవన్‌లో సీన్ మళ్లీ మొదటికి వచ్చిందా? 'నిశ్శబ్దంగా' ఉన్న గవర్నర్ స్థానంలోకి 'చురుకైన' కొత్త గవర్నర్ రావడంతో ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ ఏదో ఒక పెద్ద సంచలనమే రాబోతోందని అర్థమవుతోంది..తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశాంతంగా అందరితో కలిసిపోయి కాలం గడిపేస్తుంటే ఉన్నట్టుండి ఆయనను మహారాష్ట్రకు మార్చడం, హిమాచల్ ప్రదేశ్ నుంచి శివ ప్రతాప్ శుక్లాను తీసుకురావడం చూస్తుంటే? ఇది కేవలం అడ్మినిస్ట్రేటివ్ మార్పునా లేక 2028 అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ వేసిన మాస్టర్ ప్లానా? అని రాజకీయ విశ్లేషకులు ముక్కున వేలేసుకుంటున్నారు.యూపీ రాజకీయాల్లో ఆరితేరిన శివ ప్రతాప్ శుక్లా గారు రాకతో ఇక రాజ్ భవన్ 'రిమోట్' ఎక్కడి నుంచి పనిచేస్తుందోననే ఆందోళన కాంగ్రెస్ వర్గాల్లో కనిపిస్తోంది.అసలు అసలైన 'ట్విస్ట్' ఇక్కడే ఉంది. మన టీజేఎస్ అధినేత కోదండరాం ఎమ్మెల్సీ సీటు దశాబ్దాల కాలక్షేపంలా మారితే ఇప్పుడు మంత్రి అజారుద్దీన్ కూడా ఆ 'త్రిశంకు స్వర్గంలో' చిక్కుకున్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక 6 నెలల్లోపు సభ్యత్వం ఉండాలి. సమయం దగ్గరపడుతోంది. క్యాబినెట్ పంపిన ఫైల్ ఇప్పుడు కొత్త గవర్నర్ టేబుల్ మీదకు వెళ్తుంది.

ఆయన ఆ ఫైల్‌ను స్వీకరిస్తారా లేక "ఇది సెట్ అవ్వదు" అని పక్కన పెడతారా? సుప్రీంకోర్టు తీర్పుల దాకా ఎందుకు? 'రాజ్ భవన్ కోర్టు'లో ఏం జరుగుతుందన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న.ఇప్పటిదాకా "రాజకీయంగా విరోధం.. పాలనాపరంగా మైత్రి" అని రేవంత్ సర్కార్ సాఫీగా నడిపిస్తోంది. కానీ, కొత్త గవర్నర్ రాకతో ఆ 'మైత్రి' కూడా ఎండమావిలా మాయమవుతుందేమోనన్న భయం అధికార పక్షాన్ని వెంటాడుతోంది. మొత్తానికి గవర్నర్ వ్యవస్థ ఇప్పుడు తెలంగాణలో మళ్లీ ఒక 'కీలక రాజకీయ అస్త్రం'గా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

# 50 లక్షల ఓట్ల తొలగింపు..?

హైదరాబాద్, మార్చి 10, (

దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ తెలంగాణలో ఏప్రిల్, మే నెలల్లో జరగనుంది. ఈ ప్రక్రియ ద్వారా సుమారు 50 లక్షల ఓట్లదాకా బారీగా తొలగింపు జరగొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గడిచిన పదిహేనేళ్లలో రెండు మూడు చోట్ల ఓట్లు నమోదు చేసుకుని అన్నిచోట్లా కొనసాగుతున్న వారి డూప్లికేట్ ఓట్లు ఇకపై కొనసాగవని ఈసీ అధికారులు చెప్తున్నారు. తెలంగాణా వ్యాప్తంగా వున్న 3.35 కోట్ల ఓట్లు ఈ సవరణ తర్వాత 2.75 లేదా 2.80 కోట్లకు తగ్గిపోయే అవకాశముంది. పట్టణీకరణ, ఉపాధి అవకాశాల వల్ల ఇటీవల చాలామంది హైదరాబాద్ కు వలస వచ్చి స్థిరపడుతున్నారు. ఐనప్పటికీ వారి స్వంత గ్రామాల్లో కూడా ఓట్లు కొనసాగిస్తూ సందర్భాన్నిబట్టి రెండు చోట్లా ఓటు వినియోగించుకుంటున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ వచ్చిన వారు ఇక్కడ ఓటు నమోదు చేసుకున్నారు. రెండు రాష్ట్రాల్లోనూ అసెంబ్లీ ఎన్నికలు వేర్వేరుగా జరుగుతుండటం వల్ల రెండు చోట్లా ఓటు వినియోగించుకుంటున్నారు. తాజా సవరణ జరిగితే ఆ డూప్లికేషన్కి అవకాశం ఉండదు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో కలిపి మొత్తంగా 87 లక్షల ఓట్లు ఉన్నాయి. అందులో ఈ రకమైన డూప్లికేట్ ఓట్లు సుమారు 20 లక్షలదాకా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ జిల్లాలనుంచి వచ్చినవారితోపాటు తెలంగాణ గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చి రాజధాని నగరంలో స్థిరపడి ఓటు నమోదుచేసుకున్నవారూ ఉన్నారు. తెలంగాణలో పట్టనీకరణ వేగంగా జరుగుతోంది. హైదరాబాద్ తోపాటు జిల్లాల్లోని వివిధ ప్రధాన పట్టనాలకు వలసలు పెరిగాయి. పెద్ద పట్టనాలైన వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్ లాంటి పట్టనాల్లో ఓటర్లు భారీగా పెరిగారు. ఆమేరకు ఆయా పట్టణ పరిసల గ్రామాల్లో ఓటర్ల సంక్య తగ్గాలి కానీ వారు ఓటు మాత్రం రెండు చోట్లా కొనసాగిస్తున్నారు. ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా గ్రామీణ తెలంగాణలో కూడా సుమారు మరో 30 లక్షల ఓట్లదాకా తగ్గొచ్చని అంచనా. కొన్ని చోట్ల గ్రామాల్లో ఓటు కొనసాగించేందుకు ప్రాధాన్యత ఇవ్వగా కొందరు స్వగ్రామాల్లోనే ఓటు కొనసాగింపునకు సుముఖంగా వున్నారు. ఏది ఏమైనా రెండు చోట్ల మాత్రం ఓటు ఉండకుండా వుండేందుకు ఈసీ అన్ని జాగ్రత్త చర్యలూ తీసుకుంటోంది.బూత్ లెవల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఎన్యూమరేటర్ల ద్వారా మొదట ప్రతీ ఇల్లూ సర్వేచేసి ప్రాథమిక జాబితారూపొందిస్తారు. ఆ సమయంలో ఓటరు స్వయంగా అందుబాటులో ఉండి అక్కడే తన ఓటు కొనసాగించాల్సిందగా చెప్పవచ్చు. లేదా మీ తరఫున ఆ ఇంటి యజమాని తగిన డాక్యుమెంటు ఆధారాలిచ్చి ఫారంలో సంతకం చేసినా సరిపోతుంది. ఒకే వ్యక్తికి రెండు లేదా అంతకంటే ఎక్కువ ఓట్లున్నట్టు గుర్తించేందుకు ఈసీ ఓ ప్రత్యేక సాఫ్ట్ వేర్ వినియోగించబోతోంది. డెమోగ్రఫీ సిమిలర్ ఎంట్రీస్ ను పరిశీలిస్తారు. పేరు, తండ్రిపేరు, వయసు, చిరునామా ల్లో సిమిలారిటీ వుంటే వాటిని గుర్తించి నోటీసులు ఇస్తారు. ఎవరైతే ఈ రకమైన ఆధారాలు ఇవ్వరో ఆ ఓటు తొలగిస్తారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) మొత్తం 4 దశల్లో జరుగుతుంది. మొదటిది డోర్ టు డోర్ సర్వే – మీ బూత్ లెవల్ ఆఫీసర్లు ప్రతీ ఇంటికీ వెళ్లి సర్వేచేస్తారు. రెండవది – ఆ సర్వే ఆధారంగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల రూపొందిస్తారు. వాటి ముసాయిదా జాబితా విడుదలచేస్తారు. మూడవ దశ – జాబితాలో ఏవైనా తప్పులున్నా, ఓటు నమోదు కాకున్నా అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరించి సవరిస్తారు. నాలుగవది ఫైనల్ ఓటర్ల జాబితా. ఇప్పటికే ఎన్నికలు జరిగిన బీహార్, త్వరలో ఎన్నికలు జరగబోతోన్న బెంగాల్ , తమిళనాడు తదితర రాష్ట్రాలో ఈ ఎస్ ఐ ఆర్ పై పలు ఆరోపణలు వస్తున్నాయి. అధికార పార్టీ, లేదా యంత్రాంగం ఉద్దేశపూర్వకంగా ఓ వర్గానికి లేదా రాజకీయంగా తమకు వ్యతిరేకుల ఓట్లను వలసుల పేరిట తొలగిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మరి తెలంగాణలో ఎలా నిర్వహిస్తారో ప్రక్రియ ప్రారంభమైతే గానీ తెలియదు.

====================

# ఉగాది తర్వాత కర్ణాటకకు కొత్త సీఎం

బెంగళూరు, మార్చి 10

కర్ణాటక ముఖ్యమంత్రి పదవిపై జరుగుతున్న ప్రచారానికి తెరపడటం లేదు. అటు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వర్గం.. సీఎం మార్పు లేనే లేదంటూ వ్యాఖ్యలు చేస్తుండగా.. ఇటు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వర్గం మాత్రం.. త్వరలోనే కర్ణాటక సీఎం పగ్గాలు డీకేఎస్ చేతికి వస్తాయనే ధీమాతో ఉన్నారు. ఇక మిగిలిన కాంగ్రెస్ నేతలు కూడా కొందరు తాము కూడా సీఎం రేసులో ఉన్నామంటూ వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే ప్రధాన పోటీ మాత్రం సిద్ధూ, డీకేఎస్‌ల మధ్యే ఉంది. గత కొన్ని నెలలుగా కర్ణాటక సీఎం మార్పుపై అనేక ఊహాగానాలు వస్తుండగా.. అటు సిద్ధూ, ఇటు డీకేఎస్ వాటిని ఖండిస్తూ.. కలిసిపోతున్నారు. అయితే ఇప్పుడు మాత్రం పరిస్థితిలో కొంత మార్పు వస్తోంది.ఉగాది పండగ తర్వాత కర్ణాటక ముఖ్యమంత్రి మార్పు ఉంటుందని సాగుతున్న జోరు ప్రచారంపై సీఎం సిద్ధరామయ్య తాజాగా స్పందించారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రి పీఠాన్ని వదలాలని తనకు సూచిస్తే.. వదిలిపెట్టేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని సిద్ధూ తేల్చి చెప్పారు. పార్టీ ఆదేశాల మేరకు సీఎం పీఠం నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. తన సొంత నియోజకవర్గం వరుణలోని పిల్లాహల్లి హెలిప్యాడ్ వద్ద మీడియాతో శనివారం మాట్లాడిన సిద్ధరామయ్య.. కర్ణాటకలో అందరికంటే ఎక్కువసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన సంతృప్తి తనకు ఉందని తెలిపారు.పార్టీ హైకమాండ్ ఇంకా అవకాశం కల్పిస్తే మరో రెండుసార్లు బడ్జెట్ తానే ప్రవేశపెడతానని స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం ఏం చెబితే అది చేస్తానని.. హైకమాండ్ నిర్ణయానికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నానని తేల్చి చెప్పారు. పార్టీ పెద్దలపై తనకు పూర్తి విశ్వాసం ఉందని సిద్ధరామయ్య పేర్కొన్నారు.

2023లో జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి.. అధికారంలోకి వచ్చింది. ఆ సమయంలోనే సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య సీఎం పీఠం విషయంలో తీవ్ర పోరు నడిచింది. పోటా పోటీగా రెండు వర్గాలు ఢిల్లీలో క్యాంప్‌లు వేసి మరీ హైకమాండ్‌ను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు జరిపాయి. కొన్ని రోజుల పాటు సాగిన ఉత్కంఠకు తెరదించిన కాంగ్రెస్ అధిష్ఠానం ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్యను, ఉపముఖ్యమంత్రిగా డీకే శివకుమార్‌ను నియమించింది. అయితే ఇది రెండున్నరేళ్లు మాత్రమేనని.. ఆ తర్వాత ముఖ్యమంత్రి పగ్గాలు డీకే శివకుమార్‌కు అప్పగిస్తారనే ప్రచారం మొదటి నుంచీ జరుగుతున్నా అది మాత్రం నెరవేరడం లేదు.

# గ్రేటర్ లో పట్టు సాధ్యమేనా

హైదరాబాద్, మార్చి 10,




తెలంగాణ రాజకీయాలకు గుండెకాయ వంటి హైదరాబాద్‌లో ఇప్పుడు ముందస్తు రాజకీయ వేడి రాజుకుంది. మొన్నటి వరకు ఒకే గొడుగు కింద ఉన్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఇప్పుడు మూడు ముక్కలు (హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్) కావడంతో, పాత సమీకరణాలు చెదిరి కొత్త పొత్తులు, ఎత్తుగడలకు తెరలేచింది. ముఖ్యంగా అధికార కాంగ్రెస్, దూకుడు మీదున్న బీజేపీల మధ్య నలిగిపోతున్న భారత్ రాష్ట్ర సమితి నేతలు ఇప్పుడు తమ రాజకీయ భవిష్యత్తు కోసం పక్కచూపులు చూస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ని మూడు వేర్వేరు కార్పొరేషన్లుగా విభజించాలని నిర్ణయించడం ఈ మొత్తం గందరగోళానికి ప్రధాన కారణం. 150 డివిజన్లతో హైదరాబాద్, 74 డివిజన్లతో మాల్కాజిగిరి, 76 డివిజన్లతో సైబరాబాద్ కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం డివిజన్ల సంఖ్య 150 నుంచి 300కి పెరగడం, సరిహద్దుల పునర్విభజన జరగడంతో చాలామంది సిట్టింగ్ కార్పొరేటర్లకు తమ పట్టున్న ప్రాంతాలు చేజారుతాయనే భయం పట్టుకుంది. ఈ రీ-ఆర్గనైజేషన్ వల్ల గ్రామీణ ప్రాంతాలు పట్టణ కార్పొరేషన్లలో కలవడంతో ఓటు బ్యాంకు సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. 2016 జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 99 సీట్లు, 2020లో 56 సీట్లకు పరిమితమైంది. ఒకప్పుడు జీహెచ్‌ఎంసీపై తిరుగులేని ఆధిపత్యం చలాయించిన బిఆర్ఎస్ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతూ వస్తోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఆ పార్టీలో నైతిక స్థైర్యం దెబ్బతింది.ఈ తరుణంలో కాంగ్రెస్, బీజేపీలు కలిసి 'ఆపరేషన్ ఆకర్ష్'కు పదును పెట్టాయి. అధికారంలో ఉండటం వల్ల నిధుల కేటాయింపు, అభివృద్ధి పనుల ఆశ చూపి నేతలను ఆకర్షిస్తోంది. ఇప్పటికే మేయర్, డిప్యూటీ మేయర్ వంటి కీలక నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకోవడం పార్టీకి పెద్ద దెబ్బ. పట్టణ ప్రాంతాల్లో తమకున్న పట్టును మరింత పెంచుకోవాలని బీజేపీ చూస్తోంది. సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకోవడం ఆ పార్టీకి కొండంత బలాన్నిచ్చింది. గులాబీ పార్టీ నుండి అసంతృప్త నేతలను చేర్చుకుని, 300 డివిజన్లలో బలమైన అభ్యర్థులను నిలబెట్టాలని కమలనాథులు భావిస్తున్నారు.ప్రస్తుతం ఉన్న కార్పొరేటర్లు, టికెట్ ఆశావహులు తమ అనుచరులతో మంతనాలు జరుపుతున్నారు. "గులాబీ పార్టీలో ఉంటే భవిష్యత్తు ఉంటుందా? లేక కాంగ్రెస్, బీజేపీలలో చేరి టికెట్ హామీ పొందాలా?" అనే సందిగ్ధంలో వారున్నారు. మార్చి చివరి వారం లేదా ఏప్రిల్ మొదటి వారం నాటికి మెజారిటీ నేతలు తమ పార్టీ మార్పుపై ఒక స్పష్టమైన నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు బీఆర్ఎస్ కేడర్‌ను కాపాడుకోవడం ఆ పార్టీకి ఇప్పుడు కత్తిమీద సామేనని చెప్పొచ్చు. కొత్త అభ్యర్థులను వెతుక్కోవడం, ఉన్నవారిని బుజ్జగించడం నాయకత్వానికి సవాలుగా మారింది. ప్రభుత్వం ఉన్నప్పటికీ, హైదరాబాద్ నగర పరిధిలో క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగం బలహీనంగా ఉంది. వచ్చే 'రెడీమేడ్' నేతలే వీరికి ఆధారం. ఇక పట్టణ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నా, 300 మంది సమర్థవంతమైన అభ్యర్థులను వెతకడం వారికి పెద్ద టాస్క్.మొత్తానికి గ్రేటర్ హైదరాబాద్ ఇప్పుడు రాజకీయ చదరంగంగా మారింది. మూడు కార్పొరేషన్ల ఏర్పాటు కేవలం పాలనా సౌలభ్యం కోసమేనా లేక రాజకీయంగా గులాబీ పార్టీకిను దెబ్బతీయడానికా అన్నది పక్కన పెడితే.. ఈ వలసల పర్వం మాత్రం తెలంగాణ రాజకీయాల్లో కొత్త ప్రకంపనలు సృష్టిస్తోంది. రాబోయే కార్పొరేషన్ ఎన్నికలే వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు రిహార్సల్స్‌గా మారనున్నాయి.

# హెచ్ బీ కాలనీలో ఎల్ఐజీ, ఎంఐజీలు

హైదరాబాద్, మార్చి 10,

పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారం చేసే దిశగా తెలంగాణ సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. హైదరాబాద్ శివారులో ఎల్ఐజీ, ఎంఐజీ( వర్గాలకు తక్కువ ధరలకే ఇళ్లను కట్టించి ఇవ్వడానికి ప్రణాళికలు రచిస్తోంది. అందుకు కావాల్సిన స్థలాలపై తాజాగా హౌసింగ్ బోర్డు దృష్టిసారించింది. ఈనెల 25 నుంచి ఏప్రిల్ 4 వరకు కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్) పరిధిలోని హౌసింగ్ బోర్డు, దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్స్ స్థలాలను గుర్తించి వాటికి రక్షణ గోడలను నిర్మించాలని డిసైడ్ అయింది.ఈ 11 రోజుల్లోనే ఆయా పేద, మధ్యతరగతి ప్రజలకు స్థల సేకరణ, ఇళ్ల నిర్మాణంపై డీపీఆర్ తయారీకి ప్రణాళిక రూపొందించనుంది. హౌసింగ్ బోర్డుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 5 నుంచి 14 వరకు కేటాయింపుదారులతో కాలనీల వారీగా అధికారులు సమావేశాలను నిర్వహిస్తారు. ఏప్రిల్ 15 నుంచి 23 వరకు గ్రీవెన్స్ కాల్ సెల్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు ప్రభుత్వం ఎఫర్డబుల్ హౌసింగ్ పాలసీని సిద్ధం చేస్తోంది. ఈ నెలాఖరులోగా మార్గదర్శకాల ముసాయిదాను సర్కార్ రూపొందించనుంది. పాలసీ రూపకల్పనకు 'రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్' ద్వారా ఇప్పటికే సీబీఆర్ఐ కన్సల్టెన్సీ సంస్థను సైతం ఎంపిక చేసింది.తెలంగాణ రైజింగ్ విజన్-2047లో భాగంగా పట్టణ ప్రాంతాల్లో పీపీపీ పద్ధతిలో పేదలు, మధ్యతరగతి వారికి ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. మొత్తం మూడు దశల్లో ఈ ఇళ్ల సముదాయాలను నిర్మించనున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ ఫోర్త్ సిటీలోనూ పెద్దఎత్తున గృహ సముదాయాల నిర్మాణాన్ని చేపట్టనుంది. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర నగరాల్లోనూ తక్కువ ఆదాయ, మధ్య తరగతి పరిధిలోకి వచ్చే జనాభా ఎక్కువగా ఉంటున్నారు. వీరికి కూడా సొంత ఇల్లు కొనుక్కోవాలనే కోరిక ఉన్నప్పటికీ.. అక్కడ కూడా ధరలు భారీగా పెరిగిపోవడంతో అద్దె ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు. అందుబాటు ధరలో ఇళు ,, ఫ్లాట్లు ఉంటే వీరి సొంతింటి కలను నిజం చేసుకోవచ్చు.ఈ మేరకు టైర్ -2 పట్టణాల్లోనూ ఇళ్ల టవర్లను ఏర్పాటుచేసేలా సర్కార్ మార్గదర్శకాలను రెడీ చేస్తోంది. కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలో గృహనిర్మాణశాఖ స్థలాలను ఇప్పటికే గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో ఇళ్ల సముదాయాలు నిర్మించి అల్ప ఆదాయ, మధ్యతరగతి వారికి తక్కువ ధరలకే అందించాలని సర్కార్ ప్రయత్నాలు చేస్తోంది

# నార్కట్పల్లి వద్ద రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి..

నల్గొండ మార్చి 10,

నార్కట్పల్లి వద్ద మంగళవారం తెల్లవారుజామున న రెండు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు లారీ డ్రైవర్లు మరణించారు. హైదరాబాద్ నుండీ ఆంధ్ర వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో ప్రమాదం జరిగింది. నిలిపి ఉన్న లారీని మరో లారీ వేగంగా ఢీకొట్టడంతో క్యాబిన్ మధ్య ఇరుక్కున్న ఇద్దరు డ్రైవర్లు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## భారీగా సోలార్ ఉత్పత్తికి
# సింగరేణి ప్రణాళికలు

అదిలాబాద్, మార్చి 10,

పర్యావరణహిత గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా సింగరేణి సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. కార్మికుల నివాస గృహాలపై రూఫ్ టాప్ సౌర ఫలకాలను ఏర్పాటు చేయాలని డిసైడ్ అయింది. ఈ మేరకు సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. సుమారు రూ. 65 కోట్ల వ్యయంతో 15 వేల కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల సంస్థపై ప్రతి నెలా పడుతున్న రూ. 50-60 కోట్ల విద్యుత్ బిల్లుల భారం కొంత మేర తగ్గనుంది.సింగరేణి సంస్థ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా సింగరేణి ఏరియాల్లోని కార్మికుల నివాస గృహాలపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసి విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం అనువైన నివాస గృహాలను గుర్తించేందుకు ఆరు నెలల క్రితమే సింగరేణి అధికారులు సర్వే నిర్వహించారు. ఎక్కడైతే చెట్లు, నీళ్ల ట్యాంకులు లేకుండా ఖాళీగా నివాస గృహాలు ఉన్నాయో.. వాటిపై ఈ ప్యానళ్లు ఏర్పాటు చేసి సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా సింగరేణి యాజమాన్యం గతేడాది డిసెంబర్‌లో ఓ సంస్థతో అగ్రిమెంట్ సైతం కుదుర్చుకుంది. పదేళ్లపాటు ఈ సంస్థనే కార్మికుల ఇళ్లపై సోలార్ నిర్వహణ బాధ్యత చేపట్టనుంది.సింగరేణి క్వార్టర్లలో కార్మికుల గృహ విద్యుత్తు వినియోగానికి ప్రస్తుతం నెలకు సుమారుగా రూ.50 నుంచి 60 కోట్ల మేర చెల్లిస్తోంది. రూఫ్ టాప్ సౌర విద్యుత్తుతో సింగరేణికి ఆ భారం చాలా వరకు తగ్గనుంది. అన్ని ఏరియాల వ్యాప్తంగా 15 వేల కిలోవాట్ల మేర సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయాలని సంస్థ టార్గెట్‌గా పెట్టుకుంది. ఇందు కోసం రూ.65 కోట్ల ఖర్చు చేయనుంది. ఉద్యోగుల గృహాలకు వినియోగించగా మిగిలిన మొత్తాన్ని గ్రిడ్‌కి అనుసంధానించనున్నారు. ఈ మేరకు 800 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తే లక్ష్యంగా ఇప్పటికే పలు ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈ ప్లా?ంట్ల ద్వారా ప్రస్తుతానికి 500 మెగావాట్ల వరకు లక్ష్యాన్ని సాధించింది. రూఫ్‌టాప్ సౌర విద్యుత్తు పనులు త్వరలో ప్రారంభం అవుతాయని మణుగూరు వర్క్‌షాపు డీజీఎం శ్రీకాంత్ తెలిపారు. సౌర ఫలకలు ఏర్పాటు చేసేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని అన్నారు.కాగా, సింగరేణి సంస్థ చేపట్టిన ఈ రూఫ్ టాప్ సౌర విద్యుత్ ప్రాజెక్టు వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా.. ప్రతి నెలా కార్మికుల గృహ విద్యుత్ వినియోగం కోసం సంస్థ వెచ్చిస్తున్న రూ. 50 నుంచి 60 కోట్ల భారం గణనీయంగా తగ్గుతుందని చెబుతున్నారు. 15 వేల కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా సంస్థకు దీర్ఘకాలికంగా ఆర్థిక పొదుపు చేకూరుతుందని అంటున్నారు. పర్యావరణ పరంగా చూస్తే.. బొగ్గు ఆధారిత విద్యుత్తుపై ఆధారపడటం తగ్గి, కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని..ఇది గ్రీన్ ఎనర్జీ లక్ష్యానికి దోహదపడుతుందని వెల్లడిస్తున్నారు. గృహ అవసరాలకు పోగా మిగిలిన విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానించడం ద్వారా అదనపు శక్తి వనరుగా మారుతుందని చెబుతున్నారు. ఇది సంస్థ ఆర్థికాభివృద్ధికే కాకుండా.. సింగరేణిని పర్యావరణ హితమైన తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తుందని అంటున్నారు.

# వార్ ఎఫెక్ట్... తగ్గిన యూరియా ఉత్పత్తి

అదిలాబాద్, మార్చి 10,



రాబోయే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు యూరియా కొరత తప్పదని, వ్యవసాయ రంగంపై దీని ప్రభావం పడుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా సంయుక్తంగా దాడులు చేస్తున్నాయి. ఇరానే సైతం ప్రతిదాడులకు దిగుతుండటంతో భీకర యుద్ధం జరుగుతోంది. ఈ యుద్ధం ఎఫెక్ట్ మిగతా ప్రపంచ దేశాలపై పడుతోంది. తాజాగా.. రామగుండం ఎరువుల కర్మాగారంలో యూరియా ఉత్పత్తిపై యుద్ధం ప్రభావం చూపుతోంది. ఈ కార్మాగారం పూర్తిగా గ్యాస్ ఆధారితంగా పనిచేస్తుంది. పశ్చిమాసియా దేశాల నుంచే ఇక్కడకు గ్యాస్ సరఫరా అవుతోంది. ప్రస్తుతం కర్మాగారానికి గ్యాస్ కొరత ఏర్పడటంతో ఈ నెల 6 నుంచి ఉత్పత్తి సామర్థ్యాన్ని అధికారులు సగానికి తగ్గించారు. సరఫరాలో అంతరాయం ఇలాగే కొనసాగితే యూరియా ఉత్పత్తి మరింత క్షీణించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.రామగుండం కర్మాగారం రోజువారీ యూరియా ఉత్పత్తి లక్ష్యం 3,850 టన్నులు. అయితే ప్రస్తుత పరిస్థితుల కారణంగా ఉత్పత్తిని సగానికి తగ్గించారు. ఇక్కడి విద్యుదుత్పాదక కేంద్రం కూడా గ్యాస్ ఆధారంగానే నడుస్తోంది. దీంతో విద్యుదుత్పత్తి కూడా నిలిచిపోనుంది. ప్రత్యామ్నాయ అత్యవసరాలకు ఎన్‌పీడీసీఎల్ విద్యుత్తును వినియోగంలోకి తెచ్చుకునే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. గత ఐదు నెలలుగా ఎలాంటి అంతరాయాలు లేకుండా ఆర్ఎఫ్‌సీఎల్‌లో యురియా ఉత్పత్తి కొనసాగుతుండగా.. ప్రస్తుతం నిలిపివేయాల్సిన పరిస్థితులు రానున్నాయనే అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రామగుండం ఎరువుల కర్మాగారంలో యూరియా వార్షిక ఉత్పత్తి టార్గెట్ 12.7 లక్షల టన్నులు. ఈ ఏడాది ప్రారంభంలోనే అత్యధిక కాలం ఫ్యాక్టరీ షట్‌డౌన్‌లోనే ఉంది. దీంతో ఫిబ్రవరి నెలాఖరు వరకు 8.5 లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి మాత్రమే జరిగింది. ఈనెల 6 వరకు 1,800 టన్నుల యూరియా ఉత్పత్తి నమోదైంది. దేశవ్యాప్తంగా గ్యాస్ ఆధారిత ఎరువుల కర్మాగారాల్లో ఇంచుమించు ఇదే పరిస్థితి నెలకొందని అధికారులు చెబుతున్నారు. యూరియా ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం రైతులపై పడే అవకాశం ఉంది. రైతులు ఖరీఫ్ సీజన్ సాగు కోసం సిద్ధమవుతున్నారు. మరో 3 నెలల్లో సీజన్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో యూరియా కొరత ఏర్పడితే సాగు కష్టమవుతుందని.. అన్నదాతలకు కష్టాలు తప్పేలా లేవని వ్యవసాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

===============

# అద్భుత శిల్ప కళకు నిలయం
## ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయం

తిరుపతి / ఒంటిమిట్ట, 10 మార్చి



కడప జిల్లాలోని పవిత్ర క్షేత్రం ఒంటిమిట్టలో వెలసిన శ్రీ కోదండరామస్వామి ఆలయం అద్భుత శిల్ప సంపదకు నిలయంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలోని శిల్పాలు విజయనగర కాలం శిల్పకళ వైభవాన్ని స్మరింపజేస్తాయి. ముఖ్యంగా రంగమండపంలోని యాళి స్తంభాలు దర్శనార్థులను ఆకట్టుకుంటాయి. భారీ గండశిలలను యాళి స్తంభాలుగా మలచిన తీరు శిల్పుల అపూర్వ నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుంది.రాయల వంశ కాలంలో నిర్మితమైన అనేక ఆలయాలలో యాళి స్తంభాలు కనిపిస్తాయి. అయితే ఒంటిమిట్ట ఆలయంలో ఒక్కో స్తంభం మధ్యలో నిలువుగా ఖాళీ స్థలం ఉండి, అందులో ఒక వ్యక్తి కూర్చోగలిగే విధంగా ఉండటం ప్రత్యేకతగా నిలుస్తుంది. రంగమండపంలోని స్తంభాలపై పురాణ ఘట్టాలను ప్రతిబింబించే శిల్పాలు ఎంతో అందంగా చెక్కబడి భక్తులను మంత్రముగ్ధులను చేస్తాయి. వాటిలో రెండు స్తంభాలు సంప్రదాయ పేట్రస్ శైలిలో ప్రత్యేకంగా తీర్చిదిద్దబడి ఆకర్షణీయంగా నిలుస్తాయి.ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయం చరిత్రపురాణాల ప్రకారం త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు సీతా లక్ష్మణ సమేతుడై దండకారణ్యంలో సంచరిస్తున్న సమయంలో, సీతాదేవి దప్పిక తీర్చేందుకు భూమిలోకి బాణం సంధించగా అక్కడ నీటి బుగ్గ ఉద్భవించింది. అదే నేటి ఒంటిమిట్టలోని పవిత్ర రామతీర్థంగా భావిస్తారు.రావణ సంహారం కోసం శ్రీరాముడికి సహకరించిన జాంబవంతుడు సేవించిన శ్రీ సీతా లక్ష్మణ సమేత రామచంద్రుడే నేడు ఒంటిమిట్ట ఆలయంలో కొలువై ఉన్నారని భక్తుల విశ్వాసం. ఒకే రాతిపై శ్రీ సీతారామ లక్ష్మణుల విగ్రహాలు చెక్కబడినందున ఈ ప్రాంతాన్ని "ఏకశిలా నగరం" అని కూడా పిలుస్తారు.ఆలయంలోని శాసనాల ప్రకారం ఈ దేవాలయ నిర్మాణం 14వ శతాబ్దంలో ప్రారంభమై 17వ శతాబ్దానికి పూర్తయింది. 1356లో బుక్కరాయలు ప్రారంభించిన ఈ నిర్మాణాన్ని అనంతరం విజయనగర రాజులు, మట్లి రాజులు అభివృద్ధి చేశారు. అంతరాలయం, రంగమండపం, మహా ప్రాంగణం, గోపురాలు వంటి నిర్మాణాలు ఈ కాలంలో నిర్మితమయ్యాయి.

# కౌన్సిలర్ ను సన్మానించిన ఐసీడీఎస్ అధికారులు



ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 10 (భారత శక్తి): ములుగు మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ దివ్యను ఐసీడీఎస్ అధికారులు సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సీడీపీవో శిరీష ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. ప్రజాపాలన వ్యవస్థలో పేదలకు సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్ మండలాల సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# నిర్మల్ యువత చేత వైస్ చైర్మన్ మీర్జా ఇద్రిస్ బేగ్, మాజీ కౌన్సిలర్ సయ్యద్ ఇర్ఫాన్‌లకు ఘన సన్మానం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 10(భారత శక్తి) నిర్మల్ పట్టణానికి చెందిన యువకుల ప్రతినిధి బృందం భైంసాను సందర్శించి మాజీ కౌన్సిలర్ సయ్యద్ ఇర్ఫాన్ నివాసంలో భైంసా మున్సిపల్ వైస్ చైర్మన్ మీర్జా ఇద్రిస్ బేగ్ మరియు సయ్యద్ ఇర్ఫాన్‌లను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించింది.

ఈ సందర్భంగా యువకుల బృందం సభ్యులు రమీజ్, సల్మాన్, షైజ్ మీర్, అమీర్ రజా మాట్లాడుతూ భైంసా మున్సిపల్ వైస్ చైర్మన్‌గా మీర్జా ఇద్రిస్ బేగ్ ఎన్నిక కావడం పట్టణానికి శుభపరిణామమని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో ప్రజా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభించి, భైంసా పట్టణ సమగ్ర అభివృద్ధికి మరింత వేగం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఈ సందర్భంగా మీర్జా ఇద్రిస్ బేగ్ మరియు సయ్యద్ ఇర్ఫాన్ నిర్మల్ నుంచి ప్రత్యేకంగా వచ్చి అభినందనలు తెలిపిన యువతకు కృతజ్ఞతలు తెలిపారు. తమపై చూపిన ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు తెలుపుతూ, భవిష్యత్తులో ప్రజల అభ్యున్నతికి మరింత కృషి చేస్తామని తెలిపారు.

# మత సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను జరుపుకోవాలి: జేసీ డా.నిధి మీనా

వైయస్సార్ కడప,మార్చి 10 (భారత శక్తి): భిన్నత్వంలో ఏకత్వం భారతదేశము యొక్క ప్రత్యేకత అని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు. జిల్లాలో రంజాన్, ఉగాది, శ్రీరామనవమి పండుగల నిర్వహణపై జేసీ డా.నిధి మీనా అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ లో శాంతి కమిటీ సమావేశం జరిగింది.



ఈ సమావేశానికి రాజంపేట సబ్ కలెక్టర్ భావన,జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు, బద్వేలు, పులివెందుల ఆర్ డి ఓ లు చంద్రమోహన్,చిన్నయ్య, కడప మున్సిపల్ కమీషనర్ రాకేష్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మత సంప్రదాయాలను గౌరవిస్తూ శాంతియుత, ఆహ్లాదకర వాతావరణంలో భక్తి భావంతో రంజాన్, ఉగాది, శ్రీరామనవమి పండుగలను నిర్వహించుకునేలా జిల్లా శాంతి కమిటీ సభ్యులు సమన్వయ సహకారాలు అందించాలని తెలిపారు. శాంతియుత,ఆనంద వాతావరణంలో, ఒకరి మతాచారాలను మరొకరు గౌరవించుకుంటూ భక్తి శ్రద్ధలతో రంజాన్, ఉగాది, శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించుకుకోవాలని శాంతి కమిటీ సంఘం సభ్యులను ఆదేశించారు. అందు కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పండుగ ఏర్పాట్లు, ఉత్సవాలు సజావుగా జరిగేలా ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. మత సామరస్యానికి ప్రతీకగా అన్ని మతాల ప్రజల సహకారంతో మజీద్ లు, ఈద్గాలు,దేవాలయాల వద్ద ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ప్రార్థనలు, పూజలు జరిగేలా చూడాలన్నారు.పండుగ వేడుకల సమయంలో ఆలయాలు,మజీద్ ల అన్ని రకాల భద్రతా ఏర్పాట్లను చేపట్టాలని సంబంధిత అధికారులను జేసీ ఆదేశించారు.ఎక్కడైనా ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారులకు, పోలీసు సిబ్బందికి సమాచారమివ్వలన్నారు.అనవసరమైన విషయాలనుఅత్యుత్సాహంతో సోషల్ మీడియాలలో పోస్టు చేయడం వంటి చర్యలను అరికట్టేలా శాంతి కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ విషయంలో పోలీసు శాఖ అప్రమత్తంగా వుండాలన్నారు. పోలీస్ శాఖ ఇచ్చే సూచనలను తప్పక పాటించాలన్నారు.

రంజాన్,ఉగాది, శ్రీరామ నవమి పండుగ వేడుకలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తి భావంతో జరుపుకునేందుకు అందరూ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు, శాంతిభద్రతలకు,మత సామరస్యానికి ఇబ్బంది కలగకుండా ప్రార్థనలు,పూజలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నియమ నిబంధనలను శాంతి కమిటీ సభ్యులు ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పండుగ దినాల్లో నిరంతర నీటి సరఫరా,విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని సంబందిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల ఏర్పాట్లపై పలువురు శాంతి కమిటీ సభ్యుల అభిప్రాయాలను జేసీ స్వీకరించారు.

అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఉగాది పండుగ తో పాటు రంజాన్ శ్రీరామనవమి పండుగలు వరుస క్రమంలో ఉన్నందున ప్రజలందరూ మత సామరస్యాన్ని పాటిస్తూ వేడుకలు జరుపుకోవాలని అన్నారు.జిల్లాలో మసీదులు దర్గాల వద్ద శాంతియుత వాతావరణంలో ప్రార్థనలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు.

ఈ సమావేశంలో మైనారిటీ శాఖ జిల్లా అధికారి హిదియతుల్లా,శాంతి కమిటీ సభ్యులు, పోలీసు శాఖ, వివిధ శాఖల అధికారులు, దేవాదాయ శాఖ,మైనారిటీ అధికారులు,పలువురు అలయ అర్చకులు,మౌజమ్ లు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలే మహారాణులుగా సమాజం గౌరవించాలి - జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 10:



నేటి సమాజంలో మహిళల్ని మహారాణులుగా గౌరవించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్, ఎస్పీ నరసింహలు అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది ని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళల్లో ఆదర్శ నీయులైన వారు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు అలాంటి వారిని జీవితాలను ఆదర్శంగా తీసుకొని ప్రస్తుత మహిళా సమాజం కొనసాగాలని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ ఊహించని విధంగా తాను రాజకీయాల్లోకి రావడం జరిగిందని తెలిపారు.సూర్యాపేట మున్సిపాలిటీలో మహిళలకు ఇటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. మహిళలు ఈ సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకొని రావాలని కోరారు.

# మాదకద్రవ్యాల నిరోధానికి పటిష్ఠ చర్యలు చేపట్టాలి: రాజంపేట సబ్ కలెక్టర్ భావన

వైయస్సార్ కడప,మార్చి 10(భారత శక్తి): మత్తుపదార్థాల వినియోగం, విక్రయాలు,రవాణా ను అరికట్టడానికి జిల్లాలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని రాజంపేట సబ్ కలెక్టర్ భావన సంబంధిత అధికారులను ఆదేశించారు.



మంగళవారం కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లాలో మత్తు పదార్థాల నివారణ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధంపై జిల్లా స్థాయి యాక్షన్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు,అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు, బద్వేలు, పులివెందుల ఆర్డిఓ లు చంద్రమోహన్,చిన్నయ్య, కడప మున్సిపల్ కమీషనర్ రాకేష్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాజంపేట సబ్ కలెక్టర్ భావన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల మూల సరఫరా రవాణాను అరికట్టేందుకు జిల్లాలో పటిష్టమైన నిఘా చర్యలు అవలంబించాలని తెలిపారు.విద్యార్థులు,ఆటో డ్రైవర్లు, వర్కర్లను లక్ష్యంగా చేసుకుని సరఫరా జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని మాదకద్రవ్యాలు విక్రయాలు జరిగే చోట గట్టి నిఘా ఉంచాలన్నారు. మాదకద్రవ్యాల బారిన పడిన బాధితుల పట్ల సున్నితంగా వ్యవహరించాలని పోలీస్ శాఖ కు సూచించారు. బాధితులకు కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు పునరావాసం కల్పించాలని అన్నారు.

స్వచ్ఛంద సంస్థల సహకారంతో మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాల గురించి స్కూల్స్, కాలేజ్ లలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అధిక ప్రాచుర్యం ఉన్న సామాజిక మాధ్యమాల్లో డ్రగ్స్ నిరోధకం పై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. గ్రామ స్థాయిలో ఆశ వర్కర్, మహిళా పోలీస్, ఏ.ఎన్.ఎం., అంగన్వాడీ వర్కర్స్ ల సహకారంతో మత్తు పదార్థాల వినియోగంపై పర్యవేక్షణ చేయాలన్నారు. స్కూల్స్ మరియు కాలేజ్ ల పరిసర ప్రాంతాల్లో ఎటువంటి మత్తు పదార్థాలు అమ్మకుండా చూడాలన్నారు.

జిల్లాలో జూూ+ాజు టీమ్స్ ద్వారా మాదకద్రవ్యాల నిరోధకం, వాడకం పై ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టడం జరుగుతొందన్నారు. రిమ్స్ ప్రాంగణంలోని డి.అడ్డిక్షన్ సెంటర్ ను ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ మరియు ప్రైవేట్ హాస్టళ్ల నందు డ్రగ్స్ వినియోగం జరగకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలన్నారు. స్కూల్స్, కాలేజ్, హాస్టల్స్, మరియు డాబాలలో, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజ్ లలో బోర్డ్ లు మత్తు పదార్థాల నివారించే చర్యలపై పోస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హుజూర్ నగర్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పరిస్థితులను పరిశీలించిన జిల్లా కలెక్టర్


సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 10:

హుజుర్నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని ఈ నెల రెండవ వారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.

మంగళవారం హుజుర్నగర్ నియోజకవర్గ కేంద్రంలోనీ రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీ ని, ఇందిరమ్మ ఇండ్ల బ్లాకులు, అంతర్గత రోడ్లు, సభాస్థలిని, మొక్కలు నాటడం, పార్కింగ్ స్థలాన్ని పరిశీలించి పెండింగ్ లో ఉన్న అన్ని పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని అని స్పష్టం చేశారు. అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి,సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సిద్ధార్థ, పిడి హార్టికల్చర్ నాగయ్య, ఆర్డీవో శ్రీనివాసులు,ఈఈ మిషన్ భగీరథ కరుణాకర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# అంగన్వాడి సెంటర్ ను సందర్శించిన వైద్య విద్యార్థులు

ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 10 (భారత శక్తి) : ములుగు ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు అంగన్వాడీ సెంటర్ ను సందర్శించారు.

ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఎన్ఎంసి కరిక్యులం (పాఠ్య ప్రణాళిక)లో భాగంగా, ములుగు పట్టణ కేంద్రంలోని కృష్ణ కాలనీ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ములుగు సెక్టార్ సిడిపిఓ శిరీష అంగన్వాడి కేంద్రం ద్వారా ఆరు సంవత్సరాల వయసు లోపు పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు , బాలింతలకు కిశోర బాలికలకు అందించే ఐదు రకాల సేవల గురించి వైద్య విద్యార్థులకు వివరించారు.

అంగన్వాడి కేంద్రం లో గల చిన్నారుల ఆటపాటలను, అంగన్వాడి టీచర్లు నిర్వహించే ఆరోగ్య కార్యక్రమాలను, సేవలను, వైద్య విద్యార్థులు స్వయంగా వీక్షించారు.

ఈ కార్యక్రమంలో ములుగు వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్మెంట్ నుండి డాక్టర్ స్వామి,వాణి ,ఆరోగ్య విద్యా బోధకులు చిదురాల భాస్కర్ , అంగన్వాడి సూపర్వైజర్లు కామరున్నిసా సరస్వతి,రమాదేవి,కళావతి అనంతలక్ష్మి, అంగన్వాడి టీచర్లు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలి:

## ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

సూర్యాపేట(భారతశక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 10:

మహిళలు తమ హక్కుల సాధనకై ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దేశ స్వాతంత్రాన్ని, సౌర బహుత్వాన్ని కాపాడుకుందాం, సమానత్వానికై ఉద్యమిద్దాం, లింగ వివక్షత పై, మహిళలపై జరుగుతున్న




దాడులను వ్యతిరేకిద్దాం అనే అంశంపై జరిగిన సెమినార్ కు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన మహిళలను సన్మానించడం జరిగిందన్నారు. సమాజంలో సగభాగం ఉన్న మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించేందుకు తమ తమ రంగాలలో కృషి చేయాలని అన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళలు శ్రమదోపిడి, ఆర్థిక దోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలి.లి లిఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మిలి కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధర రూ 60 కి పెంచిందని వెంటనే దాన్ని తగ్గించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెంచిన వంటగ్యాస్ తరాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నల్లాల బావి సెంటర్ లో నిరసన వ్యక్తం చేశారు. అదే వాణిజ్య అవసరాలకు వాడే సిలిండర్ల ధర రూ116 పెరిగిందని,చమురు నిలవలు తగ్గితే ఇరాన్ నుంచే చెమరు దిగుమతికి ఆటంకాలు కొనసాగితే పెట్రోల్,డీజిల్ ధరలు అగ్గిపుల్ల లేకుండానే మండిపోతాయి అమెరికాకు తల్లోగ్గి రష్యా నుంచి దిగుమతులు నిలిపివేసిన పర్యవసన ఫలితమిది దీని మూలంగా పేద, మధ్యతరగతి ప్రజలపై తీరని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 సంవత్సరాల కాలం నుండి పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు గ్యాస్ ధరను ఇష్టానుసారం పెంచడం వల్ల ప్రజలపై మోయలేని భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక నిత్యవసర వస్తువులు ధరలు పెరిగి పెరిగిన ధరలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ములిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా ధరల మీద ధరల తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై గ్యాస్ బండ మోపటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ప్రభుత్వ గ్యాస్ వినియోగాన్ని పక్కన పెట్టి మళ్లీ కట్టెల కువైపు నెట్టటానికి ఉపయోగపడుతుందన్నారు పెట్రోల్,డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాల్సిన మోడీ ప్రభుత్వం ఆయిల్ కంపెనీల లాభాల కోసం ప్రజలపై భారాలు మోపుతుందని ఆరోపించారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించేంతవరకు పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలుతంగేళ్ల వెంకట్ చంద్ర ,ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి, జిల్లా కోశాధికారి మేకనబోయిన సైదమ్మ, సిఐటియు శ్రామిక మహిళా కన్వీనర్ చెరుకు ఏకలక్ష్మి, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొప్పుల రజిత, అంగన్వాడి టీచర్ భాస్కరమ్మ జిల్లా ఆఫీస్ బేరర్ షేక్ ఖాజాభి, జిల్లాకమిటీ సభ్యురాలు పిండిగా నాగమణి, గోలి భాగ్యమ్మ, ఎల్లమ్మ మహిళా నాయకురాలు మారుపాక ఇస్తారమ్మ, సైదమ్మ, మరియమ్మ,సువర్ణ, కనకమ్మ,ఎల్లమ్మ, పున్నమ్మ లక్ష్మమ్మ,రావేలమ్మ , అమృతమ్మ,లక్ష్మమ్మ ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్

ములుగు జిల్లా ప్రతినిధి,మార్చి10 (భారత శక్తి) : ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణం లో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు.



హాజరు వివరాలు, సీసీ కెమెరా పని తీరు, త్రాగు నీరు, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసు కున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా చూడాలన్నారు. మాల్ ప్రాక్టీస్ కి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జవాబు పత్రాల రవాణాకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షలు పూర్తయ్యేంతవరకు విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భైంసాలో సావిత్రిబాయి పూలే వర్ధంతి

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 10(భారత శక్తి): నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో మహిళా విద్యకు మార్గదర్శకురాలు మహనీయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం




ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అనంతరం చింతలభోరి గ్రామ సర్పంచ్, తెలంగాణ ఉద్యమకారుడు శ్రీ భోంస్లే పండిత్ రావు పటేల్ గారు తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యదర్శిగా ఎన్నుకోబడిన సందర్భంగా ఆయనకు ఘనంగా సన్మానం చేశారు.

ఈ సందర్భంగా భోంస్లే పండిత్ రావు పటేల్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు మరియు ఇటీవల నిజామాబాద్‌లో గౌరవ శ్రీ పొన్నం ప్రభాకర్ గౌడ్, మహేష్ కుమార్ గౌడ్ గార్లు ఇచ్చిన ఒక నెల గడువు ముగియబోతున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే ఆ హామీలను అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో యావత్ తెలంగాణ మరో ఉద్యమానికి నాంది పలకాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఈ సందర్భంగా చాకేటి లస్మన్న మాట్లాడుతూ మిలియన్ మార్చ్ జ్ఞాపకార్థంగా ఈరోజు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో అమరవీరుల స్తూపం గన్ పార్క్ వద్ద అమరవీరులకు నివాళులు అర్పించి నిమిలియన్ మార్చ్ డే" కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముష్కం రామకృష్ణ గౌడ్, ప్రధాన కార్యదర్శి చాకేటి లస్మన్న, ప్రముఖ రచయిత పుండలికరావు, కుంటాల మండల ఉద్యమకారుల ఫోరం కార్యదర్శి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 12న కలెక్టరేట్ ముందు జరుగు ధర్నాను జయప్రదం చేయండి

## -జిల్లా రైతు సంఘం అధ్యక్షులు- మల్లు నాగార్జున రెడ్డి

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 10:

యాసంగి రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు. ఈరోజు సూర్యాపేట రైతు సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రతి ఎకరాకు 15000 రూపాయలచొప్పున ఇస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత శూన్య హస్తం చూపిస్తుందని మల్లు నాగార్జున రెడ్డి విమర్శించారు. రైతు భరోసా నిధులు సాధించడానికి ఈ నెల 12న సూర్యాపేట కలెక్టర్ కార్యాలయం ముందు జరుగు ధర్నాలో రైతాంగం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేసినారు.




యాసంగి సీజన్ పూర్తి అయి మరికొద్ది రోజుల్లో కోతలు కూడా రాబోతున్నాయని అయినా నేటికీ రైతు భరోసా నిధులు రానందున రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుండి అప్పులు తెచ్చుకొని నష్టపోతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన తర్వాత ఫిబ్రవరి 17న రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన మున్సిపల్ ఎన్నికలు పూర్తయి నెల రోజులు గడుస్తున్న రైతు భరోసా ఊసే లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం మొద్దు నిదరను లేపటానికి ఈ నెల 12న సూర్యాపేట కలెక్టర్ కార్యాలయం ముందు జరుగు ధర్నా లో రైతాంగం అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు ఇచ్చారు.

యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని యాప్ వలన రైతులు యూరియా కొనలేని పరిస్థితి దాపురించిందని కేంద్ర ప్రభుత్వం వెంటనే యూరియా యాప్ ను రద్దు చేయాలని రైతులకు 24 గంటల విద్యుత్తు సప్లై చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొలిశెట్టి యాదగిరిరావు, కొప్పుల రజిత, రైతు సంఘం నాయకులు అదిరే అప్పయ్య, చిట్టెంకి యాదగిరి, ఇట్టమల్ల స్టాలిన్, వీరబోయిన రవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నాగుర్ల జన్మదిన వేడుకలు

## -కేకు మరియు పండ్లను పంపిణీ చేసిన ఆరె సంఘం నాయకులు




ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)మార్చి10:

ఆరె సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా, ఆరె కుల విద్యావంతుల వేదిక సంయుక్త నిర్వహణలో ప్రియతమ నాయకులు,ఆరె సంక్షేమ సంఘం, ఆరె కుల విద్యావంతుల వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు (నవత వెంకన్న ) జన్మదినం సందర్భంగా మంగళవారం హనుమకొండ లోని వారి నివాసంలో కేక్ కట్ చేసి,పండ్లను పంపిణీ చేసి,నాగుర్ల వెంకన్న జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆరె సంఘం నాయకులు పేర్వాల లింగమూర్తి,కొల్లూరి కండే రావు,డాక్టర్ మోటె చిరంజీవి మాట్లాడుతూ ఆపదలో ఉన్నటువంటి అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేటువంటి నాయకుడు నాగుర్ల వెంకన్న అని,ఉద్యమకారుడిగా అనేకమంది ఉద్యమకారులను ఆదుకున్నటువంటి నేతగా గుర్తింపు పొందాడన్నారు.ఆపద కాలంలో పార్టీకి అండగా ఉంటున్నటువంటి ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లును రానున్న రాజ్యసభ ఎన్నికలలో టికెట్ ఇచ్చి రాజ్యసభకు పంపాలని కేసీఆర్,కెటీఆర్ కు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొల్లూరి కండె రావు,ఆరె కుల విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డా. మోటె చిరంజీవి,ఆరె సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వాడికారి బాబురావు,గౌరవ సలహాదారులు పేర్వాల లింగమూర్తి, కోశాధికారి లోనే దీపక్ జి,రాష్ట్ర గౌరవ సలహాదారుడు మారుజోడు నరసింహారావు,హనుమకొండ మండల అధ్యక్షులు శివాజీ,జిల్లా నాయకులు నిరంజన్ రావు,చంద్రావు,రంపిస మనోహర్ రావు,రవీందర్, విద్యావంతుల వేదిక నాయకులు లడే శివ,కొలే కృష్ణ,అంబీరు శ్రీకాంత్,ఏకాంబ చిరంజీవి,లాండిగా రమేష్,ప్రకాష్, నాగరాజు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగించాలి:

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,మార్చి 10(భారత శక్తి) : ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు ప్రజల వద్దకు మరింత మెరుగ్గా చేరవేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తున్న "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు అధికారులను ఆదేశించారు.





ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సిఎస్, హైదరాబాదు నుంచి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ విసిలో భాగంగా జూమ్ కాల్ ద్వారా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులు విజయవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. అన్ని కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యం కావాలని తెలిపారు.

ఈ నెల 12వ తేదీన, సారంగాపూర్ మండలం చించోలి (బి) గ్రామంలోని ఆదిత్య గార్డెన్స్ లో సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం పై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇదే కార్యక్రమంలో భాగంగా పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించి, అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ విసిలో అదనపు కలెక్టర్ లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార, సిపిఓ జీవరత్నం, డిపివో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విజయ్ పొలిటికల్ కెరీర్‌పై ప్రభావం ఉంటుందా?: స్పందించిన ఖుష్బూ



ముంబయి: విజయ్, త్రిష కాంట్రవర్సీపై నటి, భాజపా నేత ఖుష్బూ స్పందించారు. ముంబయిలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆమెను మీడియా ప్రశ్నించగా.. బదులిచ్చారు. ''ఈ వ్యవహారంతో ప్రజలకు ఏం సంబంధం ఉందో నాకు అర్థం కావట్లేదు. అది వారి వ్యక్తిగతం. దీనిని ఎందుకు పెద్ద విషయంలా చూస్తున్నారు?'' అని పేర్కొన్నారు. ఈ కాంట్రవర్సీ విజయ్ పొలిటికల్ కెరీర్‌పై ప్రభావం చూపుతుందా? అని అడగ్గా.. ''ఎవరికి? ఎందుకు ఓటు వేయాలో ప్రజలకు బాగా తెలుసు. అయినా వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదు'' అని అన్నారు.

# 'అవతార్ 4'.. జేమ్స్ కామెరూన్ ఆలోచనలో పడ్డారా? స్పందన ఇదే!




'అవతార్'తో సినీ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు జేమ్స్ కామెరూన్. ఆ చిత్రానికి కొనసాగింపుగా మరో రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, మొదటి సినిమాతో పోలిస్తే, తర్వాత వచ్చిన చిత్రాలు విజువల్ వండర్స్‌గా అలరించినా, బలమైన కథా వస్తువు లేకపోవడం మైనస్‌గా మారింది. వసూళ్లపరంగా మాత్రం రెండూ బాగానే మెప్పించాయి. ఇక ఈ ఫ్రాంచైజీలో మొత్తం 5 సినిమాలను తీసుకురానున్నట్లు జేమ్స్ కామెరూన్ ఇప్పటికే ప్రకటించారు. మూడు సినిమాలు ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రాగా, 'అవతార్ 4' అప్‌డేట్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తాజాగా జరిగిన శాటర్న్ అవార్డుల వేడుకలో జేమ్స్ కామెరూన్ నాలుగో పార్ట్‌పై స్పందించారు. ప్రస్తుతానికి దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ''సీక్వెల్‌పై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కానీ, సెట్స్‌పైకి తీసుకెళ్లే అవకాశం పుష్కలంగా ఉంది. ఈ విషయంలో ప్రేక్షకుల అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకుంటాం. ఇప్పటివరకూ వచ్చిన మూడు చిత్రాలను మరోసారి సమీక్షించుకుని ముందుకు వెళ్తాం'' అని అన్నారు. మొదటి పార్ట్ ఇచ్చినంత కిక్.. ఆ తర్వాత వచ్చిన రెండు, మూడు పార్ట్‌లు ఇవ్వలేదన్నది జగమెరిగిన సత్యం. మరీ ముఖ్యంగా ఒకే కథను నేపథ్యం మార్చి విజువల్స్‌తో మాయ చేశారన్నది కాదలేని వాస్తవం. ఈ విషయం జేమ్స్ కామెరూన్‌కూ తెలుసు. అందుకే 'అవతార్ 4' విషయంలో ప్రేక్షకుల అభిప్రాయాలను తీసుకుంటానని అంటున్నారు. ప్రస్తుతం ఆయన వయసు 71 సంవత్సరాలు. వయసు పెరుగుతున్న రీత్యా కామెరూన్ కూడా కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందట. రెండు సినిమాలకు సంబంధించిన కథను సిద్ధం చేసుకుని, ఒకేసారి షూటింగ్ కూడా పూర్తి చేసే ఆలోచనలో ఉన్నారట. ఎంత ప్లానింగ్‌తో ముందుకు వెళ్లినా కచ్చితంగా ఈ రెండు సినిమాలకు ఐదారేళ్లు పడుతుంది.

# రామ్‌చరణ్ సుకుమార్ సినిమా.. కామెంట్స్‌పై దర్శకుడి క్లారిటీ

రామ్‌చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'ఆర్సీ 17'గా ఇది ప్రచారంలో ఉంది. ఇటీవల ఈ సినిమా గురించి సుకుమార్ అసిస్టెంట్, దర్శకుడు హుస్సేన్ షా కిరణ్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ చేసిన కామెంట్స్ అభిమానులను గందరగోళానికి గురిచేశాయి. తాజాగా ఆయన తన కామెంట్స్‌పై క్లారిటీ ఇచ్చారు. రామ్ చరణ్ సినిమా కోసం రెండు కథలు రాస్తున్నట్లు హుస్సేన్ షా చెప్పారు. దీంతో కథ ఇంకా ఫైనల్ కాలేదని, సినిమా సెట్స్ పైకి వెళ్లడానికి చాలా సమయం పడుతుందేమోనని మెగా అభిమానులు ఆందోళన చెందారు. తాజాగా ఆ కామెంట్స్‌పై ఆయన క్లారిటీ ఇచ్చారు. రెండు కథలు కాదని.. ఒకే కథ రెండు వెర్షన్‌లు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. వాటిలో అత్యుత్తమమైన దాన్ని ఎంపిక చేసుకుంటారని ఆయన స్పష్టం చేశారు. RC17 చిత్రానికి సంబంధించిన కథ ఇప్పటికే పూర్తిగా లాక్ అయిందని, సినిమా ఆలస్యం అవుతుందన్న వార్తల్లో వాస్తవం లేదని అన్నారు. 'రంగస్థలం' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత సుకుమార్ రామ్‌చరణ్ కాంబినేషన్‌లో రానుండడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం చరణ్ 'పెద్ది'తో బిజీగా ఉన్నారు.

# 'ఉస్తాద్ భగత్ సింగ్' సెన్సార్ పూర్తి.. రన్‌టైమ్, అసలు సవాల్ ఏంటో తెలుసా?

ఈ వేసవికి చక్కటి వినోదాన్ని పంచడానికి తాను సిద్ధమంటున్నాడు 'ఉస్తాద్ భగత్ సింగ్'. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఉగాది కానుకగా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా సెన్సార్ పూర్తి చేసుకోగా, ఎలాంటి కట్స్ లేకుండా యూ/ఏ సర్టిఫికెట్ వచ్చినట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ పవన్‌కల్యాణ్ శ్రీలీల నడిచి వస్తున్న పోస్టర్‌ను విడుదల చేశారు. ఇక ఈ మూవీ రన్ టైమ్ 2 గంటల 34 నిమిషాలుగా నిర్ణయించారు.

**ఈ వేగం సరిపోదు 'ఉస్తాద్'..**

తొలుత అనుకున్న షెడ్యూల్ ప్రకారం మార్చి 26న ఈ మూవీ విడుదల కావాల్సి ఉంది. 'టాక్సిక్' వాయిదాతో వారం ముందుకు జరిగింది. వరుస సెలవుల నేపథ్యంలో 'ఉస్తాద్' ముందుకు రావడం మంచి నిర్ణయమే అయినా, 'ధురంధర్ 2' నుంచి గట్టి పోటీ ఎదుర్కొని నిలబడాలి. మూవీ విడుదల, టికెట్స్ విషయంలో 'ధురంధర్ 2' చాలా స్పష్టంగా ఉంది. ఇప్పటికే పెయిడ్ ప్రీమియర్స్ టికెట్స్ ఓపెన్ అయ్యాయి. మొదటి భాగం అంచనాలను పెంచిన నేపథ్యంలో 'పార్ట్ 2' బుకింగ్స్ హాట్ కేక్స్‌గా అమ్ముడవుతున్నాయి. రెగ్యులర్ షోలకు సంబంధించి టికెట్స్ ఇంకా ఓపెన్ చేయలేదు. ఈ క్రమంలో 'ఉస్తాద్' ముందున్న అసలు సవాల్ ప్రతి అప్‌డేట్ పక్కాగా ఆన్‌టైమ్‌లో తీసుకురావడమే. ఇప్పటికే విడుదల చేసిన ట్రైలర్ టీజ్



మూవీపై ఆసక్తిని పెంచింది. ఇక ఇప్పుడు అసలు కార్యక్రమం ఉంది. అదే ఉస్తాద్ భగత్‌సింగ్ ట్రైలర్. దానిని అనుకున్న టైమ్‌కు పర్‌ఫెక్ట్ కట్స్‌తో ఎలాంటి ఇబ్బంది లేకుండా విడుదల చేయగలిగితే మిగిలింది ఫ్యాన్స్ చూసుకుంటారు. అలాగే ప్రీరిలీజ్ ఈవెంట్ ఎప్పుడు? ఎక్కడ పెడతారు? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

## సినిమా

# అది చాలా గొప్ప విషయం



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన గద్దర్ సినీ పురస్కారాలు సినీ పరిశ్రమలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ఓ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ నటుడు, దర్శకుడు ఆర్. నారాయణమూర్తి గద్దర్ పేరుతో పురస్కారాలు ప్రకటించిన ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించాడు. ఎన్నో సంవత్సరాల తర్వాత సినీ రంగానికి ప్రత్యేక గౌరవం దక్కేలా ఈ అవార్డులు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నాడు. ఆయన పేరుతో పురస్కారాలు ఇవ్వడం తెలంగాణ సంస్కృతి, పోరాట చరిత్రకు గుర్తింపుగా నిలుస్తుందన్నాడు. విప్లవ గాయకుడు ప్రజల మనసుల్లో ఎప్పటికీ జీవించే వ్యక్తని, ఆయన పాటలు సమాజంలో చైతన్యం తీసుకొచ్చాయని చెప్పాడు. తెలంగాణ గడ్డపై ప్రతి ఇంట్లో గద్దర్ వంటి స్ఫూర్తిదాయక వ్యక్తులు ఉంటారని వ్యాఖ్యానించాడు. అస్సాంలో ప్రముఖ గాయకుడు భూపేన్ హజారికాకు ఇచ్చిన గౌరవం ఎంత గొప్పదో, తెలంగాణ ప్రభుత్వం కూడా గద్దర్‌కు అదే స్థాయి గౌరవాన్ని ఇచ్చిందని పేర్కొన్నాడు.

# మెగా కోడలికి ఆన్‌లైన్ వేధింపులు



టాలీవుడ్‌నటి, మెగా కోడలు లావణ్య త్రిపాఠి సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న అసభ్యకర ప్రచారానికి వ్యతిరేకంగా పోరాటానికి దిగింది. తన వ్యక్తిగత గౌరవానికి, కుటుంబసభ్యుల ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్న వారిపై సీరియస్‌అయ్యింది. ఈ మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గత కొంతకాలంగా ఇన్‌స్టాగ్రామ్‌లో 'పర్పుల్‌క్రెయాన్ 00' అకౌంట్ ద్వారా తనపై వేధింపులు కొనసాగుతున్నాయని లావణ్య కంప్లైంట్‌లో పేర్కొంది. ముఖ్యంగా తన వ్యక్తిగత జీవితం, గౌరవాన్ని దెబ్బతీసేలా ఆరోపణలు చేస్తూ అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేసింది. కొన్ని పోస్టులపై కామెంట్ల రూపంలో అసభ్య పదజాలంతో దూషణలు చేయడమే కాకుండా తన వ్యక్తిత్వం, నైతిక విలువలను ప్రశ్నించేలా ప్రచారం చేస్తున్నారని ఫైర్‌అయ్యింది. ఈ మేరకు సదరు ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ వినియోగిస్తున్న వ్యక్తిని గుర్తించి కఠినమైన చర్యలు తీసుకోవాలని, ఇప్పటివరకు ఆ అకౌంట్ ద్వారా చేసిన పోస్టులు తొలగించేలా చర్యలు తీసుకోవాలని పోలీసులను రిక్వెస్ట్‌చేసింది. దీంతో పోలీసులు ఐటీ చట్టం సెక్షన్ 67తో పాటు బీఎన్ఎస్ 78, 79 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# సత్యవతిగా రీతూవర్మ




టాలీవుడ్ మ్యాచో స్టార్ గోపీచంద్ తన కెరీర్‌లో 33వ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఘాజీ, ఐ.బి 71, అంతరిక్షం వంటి భిన్నమైన చిత్రాలతో మెప్పించిన యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు సంకల్ప్ రెడ్డి... ఈసారి భారతదేశ చరిత్రలో మరిచిపోయిన ఓ కీలకఘట్టాన్ని వెండతెరపై చూపించనున్నాడు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ ప్రాజెక్ట్ ను పవన్ కుమార్ సమర్పిస్తున్నాడు. ఇక లేటెస్ట్ గా మేకర్స్ ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ అందించారు. ఈ మూవీలో హీరోయిన్ పేరు ప్రకటించారు. ఇవాళ రీతూ వర్మ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. విల్లు, బాణం పట్టుకొని లక్ష్యాన్ని గురిపెట్టి కనిపిస్తున్న యువతిగా ఉన్న ఈ పోస్టర్ అందరి ని ఆకట్టుకుంది. అలాగే ఈ సినిమాలో రీతూ సత్యవతి అనే పాత్రలో నటిస్తున్నట్టు కూడా రివీల్ చేశారు. ఇక ఇప్పటివరకూ ఎక్కడా కూడా చర్చల్లోలేని ఈ కథను చెప్పబోతున్నామని దర్శకుడు చెప్పుకొచ్చాడు. ఇందు కోసం గోపీచంద్ ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నాడు. అతి త్వరలోనే రిలీజ్ డేట్ ని ప్రకటించనున్నారు.

# అన్నారం రైతుల కోసం అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష

* **రియల్ ఎస్టేట్ ఏజెంట్ గా వ్యవహరిస్తున్న టి జి ఐ ఐ సి, రాష్ట్ర ప్రభుత్వం**
* **ఆరుగాలం పండే భూములను ఆగమాగం చేస్తున్నారు**
* **పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

గుమ్మడిదల మున్సిపల్, ( భారత శక్తి న్యూస్) మార్చ్10: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని అన్నారం గ్రామ పరిధిలోగల సర్వేనెంబర్ 261 లోని 580 ఎకరాలలో ఆరుగాలం పంటలు పండి రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తున్న పచ్చని భూములను నేడు రాష్ట్ర ప్రభుత్వం, టి జి ఐ ఐ సి, సంస్థలు రియల్ ఎస్టేట్ ఏజెంట్గా వ్యవహరిస్తూ అంగట్లో కూరగాయల్లాగా అమ్మకాలు చేపడుతోందని.. రైతు వ్యతిరేక నిర్ణయాలను విరమించుకోకపోతే ఆమరణ నిరాహార దీక్ష సైతం చేపడుతామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం ఉదయం స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి అన్నారం పరిధిలోని సర్వే నంబర్ 261లో గల వ్యవసాయ భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గత కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ పేరుతో చేపడుతున్న ఆగడాలను రైతులు స్వయంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి వివరించారు. అనంతరం పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు గతంలో సర్వేనెంబర్ 261 లో వ్యవసాయ భూములకు సంబంధించిన 117 మంది రైతుల వివరాలను ప్రభుత్వ రికార్డుల్లో చేర్చడంతో పాటు పాస్ బుక్కులు సైతం అందించడం జరిగిందని తెలిపారు. నాటి నుండి నేటి వరకు ప్రతి రైతు తన కుటుంబంతో కలిసి కష్టపడుతూ పంటలు పండిస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టి జి ఐ ఐ సి తో కలిసి రియల్ ఎస్టేట్ ఏజెంట్గా వ్యవహరిస్తూ.. పేద, సన్నకారు, మధ్యతరగతి వ్యవసాయ భూములను పరిశ్రమలకు కేటాయిస్తున్నామన్న పేరుతో





బడా కంపెనీలకు, రియల్ ఎస్టేట్ సంస్థలకు దారదత్తం చేస్తుందని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే అన్నారం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 261 లో గల 580 ఎకరాలను ప్రైవేటు పరిశ్రమలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పనంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ప్రజా అవసరాల కోసం రైతులను ఒప్పించి.. మెరుగైన నష్టపరిహారం అందించి తీసుకోవడం దేశవ్యాప్తంగా జరుగుతుందని.. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం రైతులను బెదిరించి అక్రమంగా.. అన్యాయంగా పచ్చని పంట భూమాలను లాక్కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నారం భూముల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే.. వేలాది మంది రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు సెక్రటేరియట్ ను ముట్టడించడంతోపాటు ఆమరణ నిరాహార దీక్ష సైతం చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. గజం భూమిని సైతం కోల్పోనివ్వమని భరోసా అందించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల్ మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, సీనియర్ న్యాయవాది బేగారి బాలకిషన్, సద్ది విజయ్ భాస్కర్, అంజాల సంజీవరెడ్డి, ఎస్.కిషన్, మేడిపల్లి మురళి,నరహరి, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, చక్రపాణి, ఐలేష్, గ్రామ రైతులు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.


## మధురై విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా: కేంద్ర మంత్రివర్గ నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి 10 (భారత శక్తి): తమిళనాడులోని మధురై విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదాని ప్రకటిస్తూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ అధ్యక్షతన ఈ రోజు నిర్వహించిన మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. టెంపుల్ సిటీగా పిలిచే తమిళనాడులోని మధురై విమానాశ్రయం ఆ రాష్ట్రంలోని పాత విమానాశ్రయాల్లో ఒకటి. దక్షిణ తమిళనాడుకి ఇది ముఖద్వారంగా ఉంది. పర్యాటకాన్ని, తీర్థయాత్రలను ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషించడమే కాకుండా ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి తోడ్పడుతుంది. మధురై విమానాశ్రయాన్ని అంతర్జాతీయ హోదా స్థాయికి పెంచడం ద్వారా ప్రాంతీయంగా రవాణా సదుపాయం విస్తరిస్తుంది. వాణిజ్యం, ఆర్థికాభివృద్ధి మెరుగవుతాయి. ఈ నగర చారిత్రక




ప్రాముఖ్యతకు సరితూగేలా అంతర్జాతీయ భక్తులను, వ్యాపారాలను ఈ విమానాశ్రయం ఆకర్షిస్తుంది.

### ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావుకు ఊరట..
## ముందస్తు బెయిల్ ఇచ్చిన సుప్రీంకోర్టు..!



హైదరాబాద్, మార్చి 10 (భారత శక్తి): ఫోన్ ట్యాపింగ్ కేసులో తెలంగాణ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్, మాజీ ఐపీఎస్ అధికారి టీ ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు మంగళవారం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. మంగళవారం జరిగిన విచారణలో తెలంగాణ ప్రభుత్వ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా వాదనలు వినిపించారు. ఈ కేసు దర్యాప్తు దాదాపు పూర్తయిందని కోర్టుకు తెలిపారు. త్వరలోనే ప్రభాకర్ రావుపై అదనపు చార్జ్‌షీట్ దాఖలు చేయనున్నట్లు పేర్కొన్నారు. తాను దర్యాప్తుకు పూర్తిగా సహకరించానని, కోర్టు ఆదేశాలను అన్ని విధాలుగా పాటించానని ప్రభాకర్ రావు ధర్మాసనానికి తెలిపారు. ఆయనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేస్తూనే, అరెస్ట్ నుంచి మినహాయింపు ఇచ్చి ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కోర్టు పలు షరతులు విధించింది. సిట్ విచారణకు సహకరించాలని, కేసులో సాక్ష్యాలను, ఆధారాలను తారుమారు చేసే ప్రయత్నం చేయొద్దని చెప్పింది. ఆదేశాలు ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు చేస్తామని హెచ్చరించింది. కోర్టు అనుమతి లేకుండా రాష్ట్రం, దేశం విడిచి వెళ్లొదని స్పష్టం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలతో పాటు పలు రంగాలకు చెందిన ప్రముఖ ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారని ఆరోపణలున్నాయి. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. అప్పట్లో ఇంటెలిజెన్స్ ఐజీగా ఉన్న ప్రభాకర్ రావు పర్యవేక్షణలోనే ఫోన్ ట్యాపింగ్ సాగినట్లుగా సిట్ గుర్తించింది. ఇదే కేసులో ప్రణీత్ రావు, రాధాకిషన్‌రావు తదితర ఉన్నతాధికారులు విచారణ ఎదుర్కొంటున్నారు. గతంలో తెలంగాణ హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించగా.. ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## సంక్షేమంలో విద్యార్థుల క్షేమం కరువు!

* **కలుషిత ఆహారం తిని హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విద్యార్థులు**
* **నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న ప్రిన్సిపాల్, వార్డెన్**
* **హాస్టల్లో వెంటిలేటర్లు, మౌళిక వసతులు లేక మగ్గి పోతున్న విద్యార్థులు**
* **అద్దె భవనాల్లో వసతి గృహాలు**
* **సరైన సమాచారం చెప్పలేక తడబడుతున్న ప్రిన్సిపాల్**
* **ప్రిన్సిపాల్, వార్డెన్ విద్యార్థుల క్షేమా వివరాలపై హైడ్రామా**

మణుగూరు, మార్చి 10 (భారతశక్తి): ఆర్థిక స్థోమత లేని పేదలు ఎందరో తమ కన్నబిడ్డల భవిష్యత్తు కోసం ప్రభుత్వ విద్యనే ఆధారమని భావించి సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో చేర్పిస్తారు. ప్రభుత్వమైతే, పేద విద్యార్థులకు మంచివిద్య అందించడానికి అండగా ఉంటూ ఉచిత విద్య, వసతి భోజనం అందిస్తూ పేద విద్యార్థుల విద్యావికాసానికి తోడ్పాటును, బాల బాలికలకు కార్పొరేట్ స్థాయి విద్యనూ అందిస్తున్నామని చెబుతున్నారు. కానీ ఆ మాటలు ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. హాస్టల్లో విద్యార్థులకు అన్నంలో పురుగులు రావడం, ఆహారం కల్తీ జరగడం, ఫుడ్ పాయిజన్ విద్యార్థుల అస్వస్థత, హాస్టల్లోకి వన్యప్రాణులు రావడం విద్యార్థుల భయాందోళనలు ఇలా నేడు హాస్టల్ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

* **సంక్షేమం లో విద్యార్థుల క్షేమం కరువు.!**

భద్రాద్రి జిల్లా, మణుగూరు మండలంలోని మహాత్మా జ్యోతిభా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల పాఠశాలలో 291 మంది విద్యార్థులు అంబేద్కర్ సెంటర్ లోని అద్దె భవనంలో విద్యను అభ్యసిస్తున్నారు. వెంటిలేటర్ లేక చిన్న చిన్న ఇరుకు గదుల్లో 291 మందికి వసతి, తరగతి గదులు అందులోనే ఉండడంతో విద్యార్థులు చదువుపై ఏకాగ్రత, స్వేచ్ఛను కోల్పోయి ఇరుకు గదుల్లో మగ్గుతూ అస్వస్థతకు గురవుతున్నారని వైద్యులు చెబుతున్నారు. విద్యార్థులకు ఏ సమస్య వచ్చిన హాస్టల్ సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు పేరెంట్స్ నుండి వెల్లువెత్తుతున్నాయి. హాస్టల్ వైపు విద్యార్థి




సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు, మీడియాను అనుమతించక పోవడంతో ప్రిన్సిపాల్, వార్డెన్ ఇష్టారాజ్యంగా మారిందని బిఆర్ఎస్ నేతలు, విద్యార్థి, మహిళ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

* **హైడ్రామా నడుమా ప్రిన్సిపాల్**

మణుగూరు మండలంలోని మహాత్మా జ్యోతిభా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి (బిసి) బాలికల పాఠశాలలో ఆదివారం రాత్రి కలుషిత ఆహారం తిని 4 గురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని వారిని వైద్యుల సూచన మేరకు సోమవారం ఉదయం ఏరియా హాస్పిటల్ కు తరలించామని బిసి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సరిత మీడియాకు తెలిపారు. ఆదివారం విద్యార్థులను కలిసేందుకు వచ్చిన పేరెంట్స్ బయటి నుండి తెచ్చిన జంక్ ఫుడ్, బిర్యానీలు తీసుకువచ్చి విద్యార్థులకు ఇచ్చారని ప్రిన్సిపాల్ చెపుతున్నారు. సోమవారం ఉదయం నుండి సాయంత్రం లోపు మిగతా 16 మంది విద్యార్థులకు కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలు అవ్వడంతో హుటాహుటిన ఏరియా హాస్పిటల్ కు తరలించి చికిత్స అందించారు. విద్యార్థి, మహిళ సంఘాలు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో వండిన ఫుడ్ తినడం వలనే ఇలా జరిగిందని ప్రిన్సిపాల్ ను ప్రశ్నించారు. ప్రిన్సిపాల్ హైడ్రామా సాగించారు. పేరెంట్స్ తెచ్చిన జంక్ ఫుడ్, బిర్యానీ దాచుకొని తినడం వలన అస్వస్థతకు గురయ్యారని తోసిపుచ్చారు. పేరెంట్స్ ను కలిసిన విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నారని, వారికి సంబంధం లేని వారికి మాత్రమే కలుషిత ఆహారం తిని అనారోగ్యంతో హాస్పిటల్ పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

* **ఘాటు వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్ నేత రేగా కాంతారావు**

తెలంగాణ ప్రభుత్వంపై బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ వ్యాప్తంగా 90 గురుకుల పాఠశాలల్లో గత కొద్దినెలలుగా 127 మంది విద్యార్థులు ప్రాణాలుకోల్పోవడం, వందలాది మందికి పైగా విద్యార్థుల అస్వస్థతకు గురికావడం, సంక్షేమ హాస్టళ్ల అధ్వాన్న పరిస్థితికి అద్దం పడుతుందని విమర్శించారు. మణుగూరు బిసి గురుకులంలో 20 మంది అస్వస్థతకు గురైతే ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా చలనం లేదని మండిపడ్డారు. విద్యార్థుల భవితవ్యంపై ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్ సరైన సమాచారం ఇవ్వకుండా హైడ్రామాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 15 నుండి టెన్త్ వార్షిక పరీక్షలు జరగనుండగా ఏకాగ్రతను కోల్పోకుండా వారికి సరైన సదుపాయాలు కల్పించి మంచి ఫలితాలు సాధిస్తామనే మనోధైర్యం కలిపించాలని కోరారు.



# గ్రామ పంచాయతీలకు శాశ్వత భవనాలు : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, మార్చి 10 (భారత శక్తి): రాబోయే మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో శాశ్వత భవనాలు లేని గ్రామపంచాయతీలు అన్నింటికి శాశ్వత భవనాలు నిర్మించాలని ఆ మేరకు పంచాయతీరాజ్ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు పోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సూచించారు. మంగళవారం సచివాలయంలో ప్రీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వివేక్‌లతో కలిసి ఆయా శాఖల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. స్థలాలు అందుబాటులో ఉన్నచోట తాసిల్దార్ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు



పరిశీలించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. చిన్నారుల మెదడు బలంగా ఎదిగేందుకు అవసరమైన పౌష్టికాహారంతో పాటు బోధనా పద్ధతులతో వారికి తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. పట్టణాల్లో రహదారుల పైన కొంతమంది చంటి బిడ్డలను పెట్టుకొని యాచక వృత్తి కొనసాగిస్తున్నారు వారందరినీ శిశు విహార్‌లో తీసుకొని అవసరమైన చర్యలు చేపట్టాలని రోడ్లపై చంటి బిడ్డలు పట్టపగలు ఎండకు, వర్షాకాలంలో వానకు తడిసి వారి విలువైన బాల్యం మసకబారి పోతుందని ఆ విధంగా జరగడానికి అవకాశం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం తెలిపారు. శిశు విహార్‌లో మోడ్రన్ కిచెన్ నిర్మించాలని సూచించారు. ఉపాధి కల్పించే విధంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులు రూపొందించాలని, గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా ఎంవోయూ కుదుర్చుకున్న కంపెనీలను సంప్రదించి అందుకు అనుగుణంగా ఏటీసీ సెంటర్లలో కోర్సులు ప్రవేశపెట్టాలని సూచించారు. క్యూర్, ప్యూర్ రేర్ పాలసీకి అనుగుణంగా వచ్చే పరిశ్రమలను దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులు ప్రవేశపెట్టాలి, స్కిల్ యూనివర్సిటీతో అనుసంధానం చేసుకోవాలని సమంత అధికారులను ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక మైనింగ్ ట్రైబల్ ఏజెన్సీల ద్వారా మాత్రమే జరగాలని ఈ క్రమంలో ఏజెన్సీలకు ఐటీడీఏల నుంచి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని వారిని ఆర్థికంగా బలోపేతం చేసి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని డిప్యూటీ సీఎం సంబంధిత అధికారులకు సూచించారు. కవ్వాల్, శ్రీశైలం వంటి టైగర్ జోన్లు అభివృద్ధి చేసుకోవాలని పర్యాటకులను ఆకర్షించే విధంగా ఎకో, టెంపుల్ టూరిజం ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

# నగర పునర్నిర్మాణమే లక్ష్యం: ముఖ్యమంత్రి

* **కూకట్‌పల్లి నల్లచెరువును ప్రారంభించిన రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, మార్చి 10 (భారత శక్తి): దేశంలోని అనేక నగరాలతో పోలిస్తే హైదరాబాద్ ఎంతో సురక్షితమని, దీనిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉండాలని, ఆ తర్వాత అందరూ అభివృద్ధిపైనే దృష్టి సారించాలని ఆయన సూచించారు. కూకట్‌పల్లి నల్లచెరువు పునరుద్ధరణ పనులను పూర్తి చేసిన నేపథ్యంలో, దానిని ఆదివారం ప్రజలకు అంకితం చేశారు.



ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర కాలుష్యం కారణంగా పాఠశాలలు, కార్యాలయాలకు సెలవులు ప్రకటించాల్సి వస్తోందని, ముంబయి వరదలు, బెంగళూరులో ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. అటువంటి సమస్యలు లేని హైదరాబాద్‌ను మరింత మెరుగ్గా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

**ముఖ్య అంశాలు:**

* మూసీ ప్రక్షాళన: గుజరాత్, ఉత్తరప్రదేశ్ తరహాలో మూసీ నదిని అభివృద్ధి చేస్తాం. మూసీ పరివాహక ప్రాంతాలు, చెరువుల పునరుద్ధరణలో ఎవరైనా నష్టపోతే తగిన పరిహారం చెల్లిస్తాం. పేదలకు అన్యాయం చేయడం ప్రభుత్వ విధానం కాదు.
* హైడ్రా పనితీరు: హైడ్రా ప్రారంభించినప్పుడు విమర్శలు వచ్చినా, వరదల నివారణలో దాని పనితీరు అద్భుతంగా ఉంది. చెరువుల అభివృద్ధి ద్వారా పర్యావరణ హితమైన నగరాన్ని నిర్మిస్తాం.
* ఆక్రమణల తొలగింపు: చెరువుల్లో ఆక్రమణల వల్లే కాలనీలు మునుగుతున్నాయి. పేదల ఇళ్లు కూల్చడం మా ఉద్దేశం కాదు, వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తాం. చెరువుల వద్ద ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు వ్యాపార అవకాశాలు కల్పిస్తాం.
* మౌలిక సదుపాయాలు: నగరంలో రోడ్ల విస్తరణ, ఫ్లై ఓవర్ల నిర్మాణం, క్రీడా మైదానాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తాం.



* **నియోజకవర్గ అభివృద్ధికి సహకారం:**
* **ఎమ్మెల్యే కృష్ణారావు**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో నాలాలు, చెరువుల సమస్యలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో కోర్టు కేసులతో నిలిచిపోయిన పనులను ఇప్పుడు వేగవంతం చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని ఇతర చెరువులను కూడా అభివృద్ధి చేయాలని కోరారు.

**30 ఎకరాలకు విస్తరణ:**

హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. ఆక్రమణలతో 16 ఎకరాలకు కుంచించుకుపోయిన నల్లచెరువును, 30 ఎకరాలకు విస్తరించినట్లు తెలిపారు. రూ. 20 కోట్ల వ్యయంతో సైకిల్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, ఇన్‌లెట్, అవుట్‌లెట్లను అభివృద్ధి చేశామని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్యేలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్, మార్చి 10 (భారత శక్తి): ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. "ప్రజాపాలనప్రగతి ప్రణాళిక"లో భాగంగా తుర్కయంజాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశానికి శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధిలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.

**ప్రధానాంశాలు:**

* గడపగడపకూ సంక్షేమ పథకాలను చేరవేయడమే లక్ష్యం.
* ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లడమే ప్రజాపాలన ఉద్దేశ్యం.
* అంబేద్కర్ చౌరస్తాలో ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి తీరుతాను.
* ప్రతి గ్రామం, పట్టణంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్య పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

# ఐడీహెచ్ కాలనీలో పిల్లల కోసం ఆహ్లాదకరమైన పార్కులు

* **అభివృద్ధి పనులపై అధికారులకు కమిషనర్ ఆదేశం**

హైదరాబాద్, మార్చి 10: భారత శక్తి, ఐడీహెచ్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీలో చిన్నారుల కోసం ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పార్కులను అభివృద్ధి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మంగళవారం సనత్‌నగర్ నియోజకవర్గం బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని ఐడీహెచ్, అంబేద్కర్ నగర్ కాలనీలలో ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. కలెక్టర్ దాసరి హరిచందన, హౌసింగ్ ఎండీ గౌతమ్ ఆయన వెంట ఉన్నారు.

* **పాత సామగ్రి తొలగింపు.. పరిశుభ్రతే లక్ష్యం:**

పాత వాంబే పథకంలో నిర్మించిన నాలుగు బ్లాకులను పరిశీలించిన కమిషనర్, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పోషకాహారం నాణ్యతపై ఆరా తీశారు. అంగన్‌వాడీ ప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న పాత వస్తువులను వెంటనే తొలగించి, ఆ ప్రాంతాన్ని ఆహ్లాదకరంగా మార్చాలని సూచించారు. గాంధీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో తనిఖీ నిర్వహించిన ఆయన,




బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని, ఆసుపత్రి ప్రాంగణాన్ని నిత్యం శుభ్రంగా ఉంచాలని మెడికల్ అధికారిని ఆదేశించారు.

**ఖాళీ స్థలాల్లో పార్కులు:**

కాలనీల్లోని ఖాళీ స్థలాలను గుర్తించి, వాటిని పిల్లల పార్కులుగా అభివృద్ధి చేయాలని సికింద్రాబాద్ జోనల్ అధికారులకు కమిషనర్ దిశానిర్దేశం చేశారు. నివాసితులంతా పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

**ఇందిరమ్మ ఇళ్లపై సర్వే**

మారేడుపల్లి అంబేద్కర్ కాలనీలో పర్యటించిన కలెక్టర్ దాసరి హరిచందన, నివాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికుల విజ్ఞప్తుల మేరకు, అర్హులైన పేదలకు కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టే అవకాశాలపై ప్రభుత్వం పరిశీలిస్తుందని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ మంగతాయారు, కవాడిగూడ డిప్యూటీ కమిషనర్ ఆర్.పుష్పలత, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, తహసీల్దార్ పాండు నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# శ్రీశైలంలో రామ్మోహన్ గౌడ్ ప్రత్యేక పూజలు

శ్రీశైలం, మార్చి 10 (భారత శక్తి): ఎల్బీ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ మంగళవారం శ్రీశైల భ్రమరాంభికా మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున భక్త సమాజం అధ్యక్షుడు ముద్దగౌని సతీష్ కుమార్ గౌడ్, కోట సుదర్శన్ రెడ్డి, నాగరాజు గౌడ్, హరినాథ రావు, ముకేశ్, లోతుకుంట వినోద్ గౌడ్, శివ గౌడ్, లక్షణ్, గిరి, ఆంజనేయులు, రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ డాక్యుమెంట్ తో భూమి కబ్జా యత్నం?

* **నకిలీ సంతకమే అని తేల్చి చెప్పిన ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్ట్**
* **పోరుమామిళ్ల మండలం లో చక్కర్లు కొడుతున్న ఫేక్ డాక్యుమెంట్స్, రైతులు తస్మాత్ జాగ్రత్త**

పోరుమామిళ్ల, మార్చి 10 (భారత శక్తి): వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం లచ్చంపల్లె గ్రామంలో సర్వే నెం.42/1లో ఉన్న భూమిపై వివాదం చెలరేగింది. మాజీ సైనికుడు నాగిరెడ్డి రామ చంద్రారెడ్డి తనకు ప్రభుత్వం కేటాయించిన భూమిని అక్రమంగా కబ్జా చేసేందుకు కుట్ర జరుగుతోందని మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. 1994లో పోరుమామిళ్ల మండలం లచ్చంపల్లె గ్రామం సర్వే నెం.42/1లో ఖాతా నెంబర్ 35లో ఉన్న 3.62 ఎకరాల భూమిని ప్రభుత్వం తనకు కేటాయించిందని ఆయన తెలిపారు. ఇదే విధంగా తన భూమి పక్కనే తన అన్నకు కూడా భూమి ఇచ్చినట్లు చెప్పారు. తాను ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉండటం వల్ల, తన అన్న (నాగిరెడ్డి శంకర్ రెడ్డి) సాగు చేస్తానని చెప్పడంతో భూమిని అతని ఆధీనంలో ఉంచినట్లు తెలిపారు.

అయితే తరువాత తన అన్నే భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించాడని, పక్కనే



ఉన్న వ్యక్తి అక్రమంగా 20 గదులు నిర్మించాడని ఆరోపించారు. ఆ వ్యక్తి మరియు తన అన్న కలిసి భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. 2025 సెప్టెంబర్ 12న కూలీలతో ఫెన్సింగ్ వేయిస్తున్న సమయంలో అవతల వ్యక్తి వచ్చి అడ్డుకున్నాడని చెప్పారు. భూమి తమ అన్న అమ్మేశాడని చెప్పడంతో, ఆధారాలు చూపించాలని అడిగితే చూపించాల్సిన అవసరం లేదని బెదిరించారని పేర్కొన్నారు. ఈ విషయంపై అప్పటి ఎస్సై ఆర్వీ కొండారెడ్డి ఇరువురిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి తన వద్ద ఉన్న డాక్యుమెంట్లు పరిశీలించారని, భూమిపై సర్వహక్కులు తనకే ఉన్నాయని తెలిపారని అన్నారు. అయితే అవతల వ్యక్తి మాజీ ఎమ్మెల్యే భర్త జె.ప్రభాకర్ అగ్రిమెంట్ చూపించాడని తెలిపారు. ఆ అగ్రిమెంట్‌పై ఉన్న సంతకం తనది కాదని అనుమానం రావడంతో ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపగా, (అడ్మిటెడ్ సిగ్నేచర్స్ (ఎ ఎస్ 1-ఎ ఎస్ 11) మరియు స్పెసిమెన్ సిగ్నేచర్(ఎస్ ఎస్ 1, ఎస్ ఎస్ 2)తో పోల్చి చూడగా, క్వశ్చన్డ్ సిగ్నేచర్ (క్యూ 1) తనది కాదని ఫోరెన్సిక్ పరీక్షలో నిర్ధారణ అయ్యిందని తెలిపారు)అన్ని లీగల్ డాక్యుమెంట్లు తన దగ్గర ఉన్నప్పటికీ, నకిలీ అగ్రిమెంట్‌తో భూమిని కబ్జా చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం తన పొలంలోకి వెళ్లకుండా కంచె వేసి అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ రక్షణ ఇవ్వలేమని చెప్పారని తెలిపారు. ఆర్డీఓ, ఎమ్మార్వోలకు కూడా ఫిర్యాదు చేయగా, ఎమ్మార్వో పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని లేఖ ఇచ్చినా కూడా పోలీసులు రక్షణ కల్పించలేదని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తాను మీడియా ముందుకు రావాల్సి వచ్చిందని, జిల్లా అధికారులు వెంటనే జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని మాజీ సైనికుడు నాగిరెడ్డి రామచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. కావున జిల్లా అధికారులు విచారణ జరిపి తన భూమికి రక్షణ కల్పించాలని ఆయన కోరుతున్నారు.



# సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

ఎల్బీనగర్ , మార్చి 10 (భారత శక్తి): భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మన్సూరాబాద్ సహారా రోడ్డులో పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పిడికిలి రాజు, మేడిగ శ్రీధర్, శనిగరపు స్వామి, బొంగు వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకులంను సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. తుకారాం రాథోడ్

మణుగూరు, మార్చి 10 (భారతశక్తి): మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభా పూలే తెలంగాణ బిసి గురుకులంలోని విద్యార్థినీలు ఆదివారం కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై ఏరియా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న బాలికలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ మంగళవారం పరామర్శించారు. హాస్పిటల్ వైద్యులను బాలికల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినీల ఆరోగ్యం పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మెరుగైన చికిత్స అందించి కోలుకున్న తర్వాతనే హాస్టల్ కు పంపించాలని ఆదేశించారు. అనంతరం బిసి హాస్టల్ ను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులను సమస్యలను



అడిగి తెలుసుకున్నారు. బయటి ఫుడ్ తీసుకోరాదని, తాజా కూరగాయలు, పండ్లు తీసుకోవడం, పరిశుభ్రమైన నీటిని త్రాగడం, హ్యాండ్ వాష్ చేయడం, చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా.సునీల్, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

# 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా ఏపీ: సీఎం చంద్రబాబు

అమరావతి, మార్చి 10 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్‌ను 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకు రాష్ట్ర తీరప్రాంతంలో లభించే విలువైన బీచ్ సాండ్ వంటి ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. తద్వారా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపునివ్వాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో గనుల శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ (APTSMM)' ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ మిషన్ ద్వారా రాబోయే పదేళ్లలో రూ.50,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు, 40,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం వనరులను వెలికితీయడమే కాకుండా, వాటికి విలువ జోడించడం (వాల్యూ ఎడిషన్)పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రేర్ మినరల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలోని వనరులపై పూర్తి అవగాహన పెంచుకోవడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా, రాష్ట్రంలోని తీరప్రాంతంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్ దేశంలోనే అత్యంత విలువైనవని అధికారులు సీఎంకు వివరించారు. వీటిలో ప్రధానంగా ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనాజైట్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి వ్యూహాత్మక ప్రాధాన్యమున్న ఖనిజాలు ఉన్నట్లు తెలిపారు. ఈ బీచ్ సాండ్ మినరల్స్ నుంచి వచ్చే ఉత్పత్తులు పెయింట్స్, కాస్మెటిక్స్, ఫార్మా రంగాలతో పాటు ఏరోస్పేస్, రక్షణ, శస్త్రచికిత్స పరికరాలు, సెరామిక్స్, ఎలక్ట్రానిక్స్, అణు ఇంధనం, అణు రియాక్టర్ల విడిభాగాల తయారీ వంటి అత్యంత కీలకమైన పరిశ్రమలకు అవసరమని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకునేందుకు రాష్ట్రంలో మూడు ముఖ్యమైన ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. శ్రీకాకుళంలో టైటానియం పార్క్ (ఏడాదికి 15 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం), అనకాపల్లిలో రేర్ ఎర్త్ కారిడార్ (ఏడాదికి 25,000 టన్నుల ఉత్పత్తి లక్ష్యం), మచిలీపట్నంలో సమగ్ర టైటానియం, రేర్ ఎర్త్ కారిడార్‌లను ఏర్పాటు చేయాలని తమ ప్రతిపాదనలను సీఎం ముందుంచారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, గనులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అది ఫేక్ ప్రచారం... వాటిని నమ్మొద్దు

అమరావతి మార్చి 10 (భారత శక్తి): వైసీపీ నాయకత్వంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆలయాలపై దాడులు అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాల విధ్వంసం జరుగుతున్నట్లు వైసీపీ ఫేక్ ముఠా ప్రచారం చేస్తోంది... ఇందులో ఎలాంటి వాస్తవం లేదు... వీటిని నమ్మొద్దు... ప్రజల మధ్య కులం, మతం, ప్రాంతం పేరుతో అలజడి రేపేందుకు యత్నిస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణం సందర్భంగా తీసిన వీడియోలతో ఫేక్ ప్రచారం చేస్తున్నారు. దేవాలయ గర్భాలయం, విమానగోపురం, అర్ధ మండపం రాతి నిర్మాణపు పనులు 60 శాతం పూర్తయ్యాయి. దేవస్థానం వైదిక కమిటీ సభ్యుల తీర్మానం ప్రకారం, ఆగమ సలహాదారుల సూచనల మేరకు ఫిబ్రవరి 28న శాస్త్రోక్తంగా పాత ఆలయాన్ని తొలగించారు. ఫేక్ ప్రచారం చేస్తున్న వైసీపీ పేటియం బ్యాచ్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రజలు నిజానిజాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అంటూ నారా లోకేశ్ ట్వీట్ చేశారు.

## తెలంగాణలో 'ఆపరేషన్ క్రాక్‌డౌన్'... 208 మంది అరెస్ట్!

హైదరాబాద్, మార్చి 10 (భారత శక్తి): తెలంగాణలో సైబర్ మోసగాళ్లకు సహకరిస్తున్న వారిపై రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఉక్కుపాదం మోపింది. 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0' పేరుతో ఫిబ్రవరి 25న ప్రారంభించిన ఈ రాష్ట్రవ్యాప్త ఆపరేషన్‌లో భాగంగా 208 మందిని అరెస్ట్ చేసినట్లు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ మంగళవారం తెలిపారు. నిందితుల్లో ఇద్దరు బ్యాంకు ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఏడుగురు విద్యార్థులు, 15 మంది మహిళలు, ఇద్దరు లెక్చరర్లు, విద్యుత్ శాఖ ఉద్యోగి కూడా ఉండటం గమనార్హం. దేశవ్యాప్తంగా జరుగుతున్న సైబర్ మోసాలకు సంబంధించిన నగదు బదిలీలకు ఉపయోగించే 'మ్యూల్ ఖాతాల'పై ఈ ఆపరేషన్ కేంద్రీకరించింది. నిందితులు 5 శాతం వరకు కమీషన్ తీసుకుని తమ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు అప్పగించినట్లు దర్యాప్తులో తేలింది. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ డేటాను విశ్లేషించిన టీజీసీఎస్‌బీ, తెలంగాణలో తెరిచిన అనుమానాస్పద ఖాతాలను గుర్తించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా 512 మంది సిబ్బందితో కూడిన 137 పోలీస్ బృందాలు రాష్ట్రవ్యాప్తంగా 137 బ్యాంకు బ్రాంచ్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. దేశవ్యాప్తంగా 9,451 కేసులతో సంబంధం ఉన్న 1,888 మ్యూల్ ఖాతాలను గుర్తించారు. ఈ ఖాతాల ద్వారా సుమారు రూ.100 కోట్ల మోసం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. అరెస్టయిన వారిలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, జూబ్లీహిల్స్ మర్చంట్ కోఆపరేటివ్ బ్యాంకులకు చెందిన ఇద్దరు ఉద్యోగులు కూడా ఉన్నారు. వీరు సరైన కేవైసీ నిబంధనలు పాటించకుండా ఖాతాలు తెరిచేందుకు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి 63 మొబైల్ ఫోన్లు, 208 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్ బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వరంగల్‌లో ఒక వ్యక్తి తన కుటుంబ సభ్యుల ఖాతాలను కూడా మోసాలకు వాడినట్లు తేలింది. కొందరు నిందితులు నకిలీ పత్రాలతో ఆన్‌లైన్‌లో ఖాతాలు తెరిచి మోసాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది.

## చర్లపల్లికామాఖ్య అమృత్ భారత్ రైలు...
## ఈ నెల 13న ప్రారంభం

హైదరాబాద్, మార్చి 10 (భారత శక్తి): హైదరాబాద్‌లోని చర్లపల్లి స్టేషన్ నుంచి అసోంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కామాఖ్య వరకు కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే మంగళవారం ప్రకటించింది. ఈ కొత్త రైలు సర్వీసును మార్చి 13న కామాఖ్యలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ రైలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను ఈశాన్య రాష్ట్రాలకు ముఖద్వారంగా ఉండే అసోంతో కలుపుతుంది. ఈ రైలులో స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి. తక్కువ ఖర్చుతో సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించే ఈ రైలు, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లే సుదూర ప్రయాణికులకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుందని రైల్వే శాఖ తెలిపింది. ఈ రైలు శ్రీకాకుళం రోడ్, విజయనగరం, పెందుర్తి, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, తణుకు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నల్గొండ స్టేషన్లలో ఆగుతుంది. రెండు రోజుల క్రితమే తమిళనాడులోని నాగర్‌కోయిల్ నుంచి చర్లపల్లి వరకు మరో అమృత్ భారత్ రైలును రైల్వే శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఈ రైళ్లను ప్రవేశపెట్టారు. అధునాతన భద్రతా ఫీచర్లు, సెమీ ఆటోమేటిక్ కప్లర్లు, ఫైర్ డిటెక్షన్ సిస్టమ్స్ వంటి సౌకర్యాలతో వీటిని రూపొందించారు. నాన్‌ఏసీ కోచ్‌లలో కూడా ప్రయాణికుల భద్రత కోసం ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడం ఈ రైళ్ల ప్రత్యేకత.

## దేశంలో చిల్లర నోట్లకు కొరత లేదు: కేంద్రం

మార్చి 10 (భారత శక్తి): దేశంలో రూ.10, రూ.20, రూ.50 వంటి తక్కువ విలువ కలిగిన కరెన్సీ నోట్లకు ఎలాంటి కొరత లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నోట్లు చలామణిలో సరిపడా ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. మంగళవారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి ఈ వివరాలను వెల్లడించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నివేదిక ప్రకారం, ఈ ఆర్థిక సంవత్సరంలో (ఫిబ్రవరి 26 వరకు) 439.40 కోట్ల పది రూపాయల నోట్లు, 193.70 కోట్ల ఇరవై రూపాయల నోట్లు, 130.30 కోట్ల యాభై రూపాయల నోట్లను సరఫరా చేసినట్లు మంత్రి తెలిపారు. సాధారణంగా ఏటీఎంల ద్వారా చిన్న డినామినేషన్ నోట్లను పంపిణీ చేయరని, అయితే వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు 'స్మాల్ వాల్యూ డిస్పెన్సర్ల' ద్వారా పంపిణీ చేసే ఒక పైలట్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు సభకు తెలియజేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా ఆర్బీఐ ఎప్పటికప్పుడు వివిధ నోట్ల అవసరాన్ని అంచనా వేస్తుందని పంకజ్ చౌధరి వివరించారు. నోట్లు, నాణేలతో పాటు డిజిటల్ చెల్లింపుల ద్వారా కూడా తక్కువ విలువ లావాదేవీల అవసరాలు తీరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. మరో ప్రశ్నకు బదులిస్తూ, రూపే కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో (2025 డిసెంబర్ 31 నాటికి) రూ.111.17 కోట్ల విలువైన 3.72 లక్షల డిజిటల్ లావాదేవీలు జరిగినట్లు మంత్రి తెలిపారు.

## ఇరాన్ నౌకలను ముంచడం మా సైన్యానికి సరదాగా అనిపించింది

అమెరికా, మార్చి 10: ఇరాన్ నౌకలను ముంచడం సరదాగా అనిపించిందని తమ సైన్యం చెప్పిందని, అదే సురక్షితమని కూడా వారు తనతో చెప్పారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. వారు చెప్పింది తనకు నిజమే అనిపించిందని అన్నారు. ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం అనంతరం ఇప్పటి వరకు 5 వేల లక్ష్యాలను ఛేదించామని ఆయన వెల్లడించారు. తమ దాడులతో ఇరాన్ క్షిపణి సామర్థ్యం 10 శాతానికి పడిపోయిందని అన్నారు. మూడున్నర రోజుల్లో ఇరాన్‌కు చెందిన 46 అగ్రశ్రేణి నౌకలను అమెరికా మిలిటరీ ముంచివేసిందని అన్నారు. ఇరాన్ డ్రోన్, క్షిపణి సామర్థ్యం పూర్తిగా ధ్వంసమవుతోందని అన్నారు. 46 ఇరాన్ నౌకలను ముంచివేశామంటే విశ్వసించగలరా అని అన్నారు. అయితే ఒక విషయంలో మన సైన్యం తీరు తొలుత తనకు నచ్చలేదని, దాంతో వెంటనే సైనికాధికారులతో మాట్లాడానని అన్నారు. ధ్వంసమైన నౌకలు ఎలాంటివని తాను అడిగానని, అవి ఇరాన్ అగ్రశ్రేణి నౌకలు అని తమ సైన్యం చెప్పిందని అన్నారు. అలాంటప్పుడు వాటిని స్వాధీనం చేసుకుని మన కోసం ఉపయోగించుకోవచ్చు కదా, ఎందుకు ముంచివేశారని తాను వారిని ప్రశ్నించానని తెలిపారు. వాటిని ముంచడం సరదాగా అనిపించిందని, అలా చేయడమే సురక్షితమని వారు సమాధానం చెప్పారని అన్నారు. వారి సమాధానం తనకు నిజమే అనిపించిందని అన్నారు. అమెరికా సైన్యం పశ్చిమాసియాకు విహారయాత్రకు వెళ్లిందని, అక్కడ ఉన్న చెడును వదిలిస్తోందని పేర్కొన్నారు. ఆ యాత్ర కొద్దికాలమే ఉంటుందని, అది అందరూ చూస్తారని తెలిపారు. శత్రువును పూర్తిగా ఓడించే వరకు అమెకరికా సైన్యం వెనుకడుగు వేయదని డొనాల్డ్ ట్రంప్ అన్నారు.

## ఇరాన్‌పై అమెరికా యుద్ధంతో ప్రయోజనం పొందుతున్న దేశం రష్యా

ఇరాన్, మార్చి 10: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం వల్ల ప్రయోజనం పొందుతున్న ఏకైక దేశం రష్యా అని యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియా కోస్టా అన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ప్రపంచంలో ఇంధన ధరలు భారీగా పెరుగుతున్నాయని అన్నారు. దీని వల్ల ఈ యుద్ధం వల్ల గెలిచిన వారెవరైనా ఉన్నారా అంటే రష్యా మాత్రమే అన్నారు. బ్రస్సెల్స్‌లో ఈయూ రాయబారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉక్రెయిన్‌పై రష్యా నాలుగేళ్లుగా యుద్ధం చేస్తోందని, ఈ యుద్ధాన్ని కొనసాగించడానికి తాజా ఇంధన ధరల పెరుగుదల మంచి ఆర్థిక వనరుగా మారిందని అన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల పైనే ప్రధాన దృష్టి ఉండటంతో ఉక్రెయిన్‌పై కొంత శ్రద్ధ తగ్గిందని అన్నారు. తద్వారా రష్యా ప్రయోజనం పొందుతోందని అన్నారు. అంతర్జాతీయ చట్టాలను అమెరికా సవాల్ చేస్తోందని, వీటిని పరిరక్షించాల్సిన బాధ్యత ఈయూపై ఉందని ఆంటోనియా కోస్టా పేర్కొన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు పశ్చిమాసియాలో భాగస్వామ్య పక్షాలన్నీ ఒకే తాటిపైకి రావాల్సి ఉందని అన్నారు. బాంబుల ద్వారా స్వేచ్ఛా, మానవ హక్కులు సాధించలేమని అన్నారు. అంతర్జాతీయ చట్టాల ద్వారానే ఇది సాధ్యమని అన్నారు. ఈ పరిస్థితులు మరింత తీవ్రరూపం కాకుండా చూడాలని లేదంటే పశ్చిమాసియా, యూరప్‌తో పాటు ఇతర ప్రాంతాలకు కూడా ముప్పేనని అన్నారు.

## పసిడికి మళ్లీ రెక్కలు.. భారీగా పెరిగిన బంగారం, వెండి

ఢిల్లీ, మార్చి 10 (భారత శక్తి): ఇవాళ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. అమెరికా డాలర్ బలహీనపడటం, మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టవచ్చన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలతో ముడి చమురు ధరలు పడిపోవడం వంటివి పసిడికి ఊపునిచ్చాయి. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఏప్రిల్ గోల్డ్ ఫ్యూచర్స్ 1.15 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,62,150 వద్ద ట్రేడ్ అయింది. అదే సమయంలో మే సిల్వర్ ఫ్యూచర్స్ 3.68 శాతం లాభపడి కిలోకు రూ.2,77,000కు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 5,082.51 డాలర్లకు, స్పాట్ సిల్వర్ 82.50 డాలర్లకు పెరిగాయి. మధ్యప్రాచ్యంలో ఇరాన్‌తో ఉద్రిక్తతలు తగ్గే అవకాశం ఉందని ట్రంప్ వ్యాఖ్యానించడంతో చమురు ధరలు భారీగా తగ్గాయి. బ్రెంట్ ఫ్యూచర్స్ ఒక దశలో 10.85 శాతం పడిపోయి బ్యారెల్‌కు 88.22 డాలర్ల కనిష్ఠానికి చేరింది. చమురు ధరలు తగ్గితే ద్రవ్యోల్బణ భయాలు తగ్గుతాయని, ఫలితంగా కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచకపోవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఇది వడ్డీ ఆదాయం లేని బంగారానికి మద్దతునిస్తుంది. మరోవైపు డాలర్ ఇండెక్స్ 0.44 శాతం తగ్గి 98.74 వద్దకు చేరడంతో ఇతర కరెన్సీల కొనుగోలుదారులకు బంగారం చౌకగా మారింది. ప్రస్తుతం ఇన్వెస్టర్ల దృష్టి అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలపై ఉంది. రేపు వెలువడనున్న వినియోగదారుల ధరల సూచీ (సి.పి.ఐ), శుక్రవారం రానున్న వ్యక్తిగత వినియోగ వ్యయాల (పీసీఈ) సూచీ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నెల 18న జరిగే ఫెడ్ పాలసీ సమావేశంలో వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## వంటగ్యాస్ ఆందోళన... ప్రధాని మోదీ కీలక సమీక్ష

వంటగ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వంటగ్యాస్‌ను బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో 10 శాతం మేర ఉత్పత్తిని పెంచాలని ఇంధన ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. ఇంధన ఉత్పత్తిపై ఆందోళనలు రేకెత్తుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక భేటీ నిర్వహించారు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరితో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. ఎల్పీజీ నిల్వలు, సరఫరాపై సమీక్ష జరిపారు. కాగా ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో కేంద్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. కమర్షియల్ ఎల్పీజీ వాస్తవ అవసరాలను గ్యాస్ కంపెనీలు అందుకోవాల్సిందేనని ఇంధన కంపెనీలకు స్పష్టం చేసింది. ఇరాన్, అమెరికా ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో కొంత సంక్షోభం వాస్తవమే కానీ పెట్రోలియం ఉత్పత్తుల ప్రస్తుతానికి ఇబ్బంది లేదని కేంద్రం తెలిపింది. పశ్చిమాసియాలో యుద్ధానికి ముందు తరహాలోనే భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అన్నారు. దేశానికి వచ్చే 70 శాతం ఉత్పత్తులు హోర్ముజ్ జలసంధి నుంచి కాకుండా ఇతర మార్గాల్లో వస్తున్నట్లు కేంద్రం తెలిపింది.



## దుబాయ్ లో యుద్ధ భయం.. ఎడారిలో మూగజీవాల ఆక్రందన

మార్చి 10: పశ్చిమాసియాలో ముదురుతున్న ఉద్రిక్తతలు దుబాయ్‌లో విషాదకరమైన దృశ్యాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ఇరాన్ దాడుల భయంతో సురక్షిత ప్రాంతాలకు వెళుతున్న ప్రవాసులు.. తమతో పాటు ఇన్నాళ్లు కలిసి ఉన్న పెంపుడు జంతువులను నడిరోడ్డుపై వదిలేస్తున్నారు. యజమానులు తమ కుక్కలను స్తంభాలకు కట్టేసి అలాగే వెళ్ళిపోతున్నారు. ఆహారం, నీరు లేక అవి ఆక్రందనలు చేస్తున్నాయి. పిల్లులను అట్టపెట్టెల్లో పెట్టి, వాటిపై "మమ్మల్ని క్షమించండి.. వీటిని తీసుకెళ్లడం మా వల్ల కాదు" అని రాసి రోడ్ల పక్కన పడేస్తున్నారు. కొంతమంది ప్రవాసులు పెంపుడు జంతువులను తరలించే ఖర్చు భరించలేక, వాటికి విషం ఇచ్చి చంపేయాలని పశువైద్యులను కోరుతుండటం అక్కడి పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రాణం కంటే ప్రేమ చిన్నదైపోయిందన్నట్లుగా సాగుతున్న ఈ పరిణామాలు జంతు ప్రేమికులను కలచివేస్తున్నాయి.

**ఎడారిలో మూగజీవాల హాహాకారాలు**

రోడ్డు మార్గంలో ఒమన్ సరిహద్దులకు చేరుకుంటున్న వారు, అక్కడ జంతువులకు అనుమతి లేకపోవడంతో వాటిని ఎడారిలోనే వదిలి వెళుతున్నారు. భగభగమండే ఎండలో ఆహారం లేక అవి అలమటిస్తున్నాయి. అటు జంతు సంరక్షణ కేంద్రాలు కూడా ఇప్పటికే నిండిపోవడంతో కొత్తగా వచ్చే జంతువులను చేర్చుకోవడం వారికి భారంగా మారింది. రోజుకు వందల సంఖ్యలో ఫోన్ కాల్స్ వస్తున్నాయని స్వచ్ఛంద సంస్థలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

**సరిపోని స్మార్ట్ మెషీన్ల సాయం..**

దుబాయ్ మున్సిపాలిటీ వీధి జంతువుల కోసం ఏర్పాటు చేసిన 'ఎహ్సాన్ స్టేషన్' (ఆహారం అందించే స్మార్ట్ మెషీన్లు) ఇప్పుడు పెరుగుతున్న ఈ సంఖ్యకు సరిపోవడం లేదు. సంపన్న దేశంలో ఇలాంటి అమానవీయ ఘటనలు జరగడం పట్ల అంతర్జాతీయ స్థాయిలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

## యుద్ధం ఎప్పుడు ఆపాలన్నది మా చేతుల్లోనే ఉంది: ఇరాన్ స్పష్టీకరణ

ఇరాన్: పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా అలముకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. ఇరాన్‌పై యుద్ధం "చాలా త్వరగా ముగుస్తుంది" అన్న ట్రంప్ మాటలకు.. "యుద్ధం ఎప్పుడు ముగియాలో నిర్ణయించేది అమెరికా కాదు.. మేమే" అంటూ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్ జీసీ) దీటుగా జవాబిచ్చింది.

**ఐఆర్ జీసీ ప్రకటన..**

"ఈ ప్రాంతం యొక్క భవిష్యత్తు, సమీకరణాలు ఇప్పుడు మా సాయుధ దళాల చేతుల్లో ఉన్నాయి. అమెరికా దళాలు యుద్ధాన్ని ముగించలేవు.

# డ్రైనేజీ పొంగి పొర్లుతున్నా పట్టించుకునే నాథుడు లేడు

* దుర్గంధమయంగా మారిన చెరుకు తోట కాలనీ
* పది రోజులయినా అధికారులు పత్తా లేరు
* సమస్య తీర్చకపోతే వేలాదిమందితో సత్యాగ్రహ దీక్షకు సిద్ధమని హెచ్చరిక

ఎల్బీనగర్, మార్చి 10 (భారత శక్తి): సరూర్నగర్ డివిజన్ చెరుకు తోట కాలనీలో పది రోజులుగా డ్రైనేజీ నీళ్లు పొంగిపొర్లుతూ కాలనీ మొత్తం కంపుతో, దుర్గంధమయంగా మారిన సందర్భంగా చెరుకుతోట కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, సోమవారం ప్రజావాణిలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయగా, మంగళవారం ఉదయం చెరుకు తోట సరూర్నగర్ డివిజన్ జలమండలి డీజీఎం చందు నాయక్ వర్క్ ఇన్స్పెక్టర్లు రాజేష్ నాయక్ గల్పర్ సిబ్బందితో సందర్శించారు. ఇక్కడ సమస్య ఉన్న ప్రాంతానికి అధికారులకు సరూర్నగర్ డివిజన్ కాలనీ సంక్షేమ సంఘాల జేఏసీ అధ్యక్షులు బేర బాలకిషన్ కాలనీవాసులు రంజిత్, పోచమ్మ బస్తీ కాలనీ నార్త్ సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మోహన్ ఆచారి మహిళా నాయకురాళ్లతో కలిసి వారి దృష్టికి తీసుకొని వచ్చారు. ఈ సందర్భంగా అధికారులను తీసుకొని కాలనీ అంతా కలియ తిరుగుతూ, డ్రైనేజీ నీళ్లు శాశ్వతంగా రాకుండా పరిష్కారం కనుక్కోవాలని డీజీఎం చందు నాయక్ దృష్టికి తీసుకొని వచ్చారు.వారం రోజుల్లో డ్రైనేజీ లైను కొత్తగా మార్చేసి సమస్యను పరిష్కరిస్తామని వాటర్ వర్క్స్ డీజీఎం చందు నాయక్ వారి సిబ్బంది కాలనీవాసులకు, నాయకులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సరూర్నగర్ డివిజన్ కాలనీ సంక్షేమ సంఘాల జేఏసీ అధ్యక్షులు బేర బాలకిషన్ మాట్లాడుతూ ఒక చెరుకు తోట కాలనీలోనే కాకుండా



సరూర్నగర్ డివిజన్ పరిధిలోని సరూర్నగర్ ఓల్డ్ విలేజ్ పోచమ్మ బాగ్ కాలనీ పంజాల అనిల్ కుమార్ కాలనీ హుడా కాలనీ, హుడా కాంప్లెక్స్ అంబేద్కర్ నగర్ లోని అనేక కాలనీలలో వాటర్ వర్క్స్ అధికారుల సమన్వయ లోపంతో డ్రైనేజీ లైన్లన్నీ డ్యామేజ్ అయినవి గుర్తించలేని పరిస్థితుల్లో ఉన్నారని వెంటనే జలమండలి, జిహెచ్ఎంసి అధికారులు సమన్వయతో పనిచేసి సరూర్నగర్ డివిజన్లో ఉన్నటువంటి సమస్యలను వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, వారం పది రోజుల్లో పరిస్థితి చక్కబడకపోతే వేలాదిమంది కాలనీవాసులతో, మహిళా సంఘాలతో జిహెచ్ఎంసి సరూర్నగర్ సర్కిల్ ముందు ప్రజల పక్షాన సమస్యల పరిష్కారం కోసం సత్యాగ్రహం నిర్వహిస్తామని బేర బాలకిషన్ అధికారులను హెచ్చరించారు.

## సాయిరాం కాలనీలో
# సీసీ రోడ్డు పనుల పరిశీలన

* నాణ్యతతో పనులు పూర్తి చేయాలి: మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

వనస్థలిపురం, మార్చి 10 (భారత శక్తి) : బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాయిరాం కాలనీలో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనుల నాణ్యతను తనిఖీ చేసి, అధికారులకు పలు సూచనలు చేశారు.

**త్వరగా పూర్తి చేయాలి..**

అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డు నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లెవలింగ్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డివిజన్ అభివృద్ధికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రతి కాలనీలో ఉన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంజీవరెడ్డి,



కల్చరల్ సెక్రటరీ శ్రీదేవి, రామ్ మూర్తి, అడ్వైజర్ జనార్ధన్, ఈసీ మెంబర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం వర్క్ ఇన్స్పెక్టర్ సంజీవరెడ్డి మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# 99 రోజుల కార్యాచరణను పక్కాగా అమలు చేయాలి

: **జోనల్ కమిషనర్, కే చంద్రకళ**

బడంగ్‌పేట్, , మార్చి 10 (భారత శక్తి): బడంగ్‌పేట్ సర్కిల్ 16 పరిధిలో 99 రోజుల ప్రణాళికను అధికారులు పక్కాగా అమలు చేయాలని జోనల్ కమిషనర్ కె.చంద్రకల హెచ్చరించారు. ఈ మేరకు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, నిత్యం చేపట్టాల్సిన కార్యక్రమాలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అంతకుముందు, డిప్యూటీ కమిషనర్ పి.సరస్వతి, గ్రూప్ 1 ట్రైనీ అధికారి సాయి శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి అల్మాస్‌గూడ సౌభాగ్యనగర్ కాలనీలో పర్యటించారు. అక్కడ స్థానికులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అల్మాస్‌గూడలోని కొమటికుంట చెరువు వద్ద ఉన్న ఎస్ఎన్‌డీపీ (SNDP) నాలాను పరిశీలించారు. సర్కిల్ పరిధిలో సేవలు అందని గృహాలను గుర్తించి, వెంటనే వివరాలను అధికారులకు అందజేయాలని గ్రూప్ 1 ట్రైనీ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీవైఈఈలు అభినయ్ కుమార్,






వెంకన్న, ఏఈలు గంగా ప్రసాద్, హరీష్, సౌమ్య, జ్యోత్స్న, ఏసీపీ కిరణ్ కుమార్, ఏఎంఓహెచ్ ప్రవీణ్, యూబీడీ మేనేజర్ పోకల రావు, వెటర్నరీ అధికారి రవి, ఏఎంసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# విపత్తు వేళ.. యువతే భరోసా!

* సికింద్రాబాద్‌లో 'సివిల్ డిఫెన్స్' శిక్షణ ప్రారంభం
* ఏడు రోజుల పాటు ఫైర్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక కార్యక్రమం
* పాల్గొన్న మాజీ డీజీపీ అరుణా బహుగుణ

సికింద్రాబాద్ఏ, మార్చి 10 (భారత శక్తి): దైనా ప్రమాదం జరిగినప్పుడు లేదా విపత్తు సంభవించినప్పుడు అగ్నిమాపక, పోలీసు యంత్రాంగం వచ్చే వరకు వేచి చూడటం వల్ల ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. ఈ లోటును భర్తీ చేసేందుకు, యువతను 'తొలి స్పందనకారులు'గా (ఫస్ట్ రెస్పాండర్స్) తీర్చిదిద్దేందుకు తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం నడుం బిగించింది. సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ సెంటనరీ డిగ్రీ కాలేజీలో సోమవారం నుంచి ఏడు రోజుల పాటు 'సివిల్ డిఫెన్స్ వాలంటీర్ ట్రైనింగ్' ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది.

**ప్రమాదాల్లో యువత పాత్ర కీలకం..**

కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ డీజీపీ అరుణా బహుగుణ మాట్లాడుతూ.. ప్రమాద స్థలంలో అత్యవసర సేవలు అందేలోపు స్థానిక యువత స్పందించి సహాయం చేయడం ప్రాణాలను కాపాడటంలో కీలకమన్నారు. ఇలాంటి శిక్షణ ద్వారా యువతను ఆపద కాలంలో ఆదుకునే శక్తివంతులుగా



మారుస్తామన్నారు.

**శిక్షణలో ఏం నేర్పిస్తారంటే..**

ఈ ఏడు రోజుల పాటు జరిగే శిక్షణలో వాలంటీర్లకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తారు:

* రెస్క్యూ ఆపరేషన్స్: ప్రమాదాల నుంచి బాధితులను సురక్షితంగా బయటకు తీసుకురావడం.
* ఫైర్ ఫైటింగ్: మంటలను ఆర్పే ఆధునిక పద్ధతులు.
* **ఫస్ట్ ఎయిడ్: ప్రాథమిక చికిత్స అందించడం.**
* క్రౌడ్ కంట్రోల్: రద్దీగా ఉండే ప్రాంతాల్లో పరిస్థితిని అదుపులో ఉంచడం.
* అత్యవసర స్పందన: యుద్ధ పరిస్థితులు, రసాయన, అణు దాడులు జరిగినప్పుడు ప్రభుత్వ శాఖలతో కలిసి పనిచేయడం.

ఈ శిక్షణ పూర్తి చేసుకున్న వాలంటీర్లు పోలీసు, అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి విధుల్లో ఉంటారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ సివిల్ డిఫెన్స్ డీజీ విక్రమ్ సింగ్ మాన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఎఫ్ఓ బి. సుధాకర్ రావు, డీఎఫ్ఓ దాస్, అకాడమిక్స్ డీన్ డాక్టర్ కళ్యాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు మరియప్పన్, మహ్మద్ అబ్దుల్ రహీమ్ పాల్గొన్నారు.




## జీహెచ్ఎంసీ కాంపౌండ్ వాల్‌ను
# పునాదిగా చేసుకుని కబ్జా

* చందానగర్‌లో 400 గజాల పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా.

హైదరాబాద్, , మార్చి 10 (భారత శక్తి): శేరిలింగంపల్లి మండలం చందానగర్ భవానీపురంలో కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాలనీకి చెందిన 400 గజాల పార్కు స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకుంటున్నారని భవానీపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఇటీవల హైడ్రా 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారు. గతంలో జీహెచ్ఎంసీ అధికారులు సదరు పార్కు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి హద్దులను నిర్ణయించారు. అయితే, ఆ ప్రహరీనే పునాదులుగా మార్చుకుని, అక్రమంగా గృహ నిర్మాణం చేపట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన హైడ్రా అధికారులు, జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. లేఅవుట్ పత్రాలను పరిశీలించగా అది పార్కు స్థలమేనని నిర్ధారణ అయ్యింది. మంగళవారం రంగంలోకి దిగిన అధికారులు అక్రమ కట్టడాలను తొలగించి, 400 గజాల స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ స్థలం పార్కుకు చెందినదని తెలియజేసేలా బోర్డులను కూడా నాటారు. స్వాధీనం చేసుకున్న ఈ స్థలం విలువ సుమారు రూ. 2 కోట్లు ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. పార్కు స్థలాన్ని కాపాడినందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




# మైనారిటీలకు సర్కారు భరోసా: రంజాన్ కానుకల పంపిణీ

ఎల్‌బీనగర్, మార్చి 10 (భారత శక్తి): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మైనారిటీలకు అండగా నిలుస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ స్పష్టం చేశారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో మంగళవారం రంజాన్ తోఫా పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ.. మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రతి మసీదు కమిటీకి సుమారు 250 రంజాన్ కానుకలను అందజేస్తున్నామని తెలిపారు. పండగ రోజున మసీదుల్లో ఇఫ్తార్ విందుల కోసం ప్రభుత్వం



రూ. లక్ష వరకు ఆర్థిక సాయం అందిస్తోందని వెల్లడించారు. మైనారిటీలు సంతోషంగా పండుగ జరుపుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**సంక్షేమ పథకాలపై ఫోకస్**

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత మైనారిటీల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని మధుయాష్కీ పేర్కొన్నారు. మైనారిటీ మహిళల స్వయం ఉపాధి కోసం కుట్టుమిషన్లు, రూ. 50 వేల ఆర్థిక సాయం, వాహనాల పంపిణీ వంటి పథకాలను ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.